ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

గుంటూరు జిల్లా వార్తలు
3
ఆదివారం 14 జూలై 2024


ఎస్పీ శ్రీనివాసరావు (పల్నాడు జిల్లా)


ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ (గుంటూరు జిల్లా)





పాలనలో ఆధ్యాత్మికతతోపాటు ఆధునికతను జోడిస్తాను. పేదరికం లేని రాష్ట్రమే ధ్యేయం. రాష్ట్రంలో నవ్వులు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం జీవితాల్లో ఆనందం నింపుతుందని అందరూ చెబుతుంటే సంతోషకరంగా ఉంది. దేశంలో ఉన్న గొప్ప సంపద కుటుంబ వ్యవస్థ. దీనిని భావితరాలకు అందించాలి. ఈ ప్రపంచాన్ని నడిపిస్తున్న శక్తి భగవంతుడే. ప్రార్థనాలయాలు ఏ మతానికి సంబంధించిన వైనా ఈ భూమిపై లేకపోతే నేరాలు ఘోరాలు ఎన్నో జరిగేవి. సైంటిస్టులు, డాక్టర్లు, పారిశ్రామిక వేత్తలు, న్యాయవ్యవస్థ ఇలా అందరూ విధులు ప్రారంభించడానికి ముందు రెండు నిమిషాలు దేవుడిని ప్రార్థిస్తారు. హరేకృష్ణ మూమెంట్, ఇస్కాన్‌లు పోటీ పడి మన సంస్కృతిని కాపాడుతున్నాయి. - ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

ఆధ్యాత్మికత.. ఆధునికత

- పాలనతో జీవితాలు ఆనందమయం
- ధర్మాన్ని కాపాడుతున్న ధార్మిక సంస్థలు
- అక్షయ పాత్ర, గోకుల క్షేత్ర సేవలు భేష్
- కొలనుకొండ గోకులక్షేత్రంలో సీఎం చంద్రబాబు నాయుడు

తాడేపల్లి, జూలై 13: ప్రపంచాన్ని ముందుకు నడిపించేది నమ్మకమేనని, మనకు తెలియని ఏకైక శక్తి దేవుడేనని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తెలిపారు. తాడేపల్లి మండలం బైపాస్‌లోని కొలనుకొండ హరేకృష్ణ గోకుల క్షేత్రంలో శనివారం వేంకటేశ్వరస్వామి దేవాలయ అనంత శేష స్థాపన, గర్భాలయ భూస్పర్శ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా చంద్రబాబు ప్రసంగిస్తూ ధర్మాన్ని కాపాడడానికి విశ్వాసాన్ని కలిగించే ధార్మిక సంస్థలు ఉండడం అందరి అదృష్టమన్నారు. ప్రభుత్వం తరఫున కూడా ఇలాంటి సంస్థలకు పూర్తిగా సహకరిస్తామన్నారు. ఏ కార్యక్రమాన్ని అయినా సజావుగా చేయగలమన్న నమ్మకాన్ని హరేకృష్ణ మూమెంట్ కలిగిస్తుందన్నారు. హరేకృష్ణ మూమెంట్‌తో పోటీ పడి ఇస్కాన్ కూడా కార్యక్రమాలు చేస్తుందని చెప్పారు. మధు పండిత దాస అనుకున్నది సాధిస్తారని, నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడతారని తెలిపారు. హరేకృష్ణ మూమెంట్‌లో సత్య గౌర చంద్రదాస సహా ఐఐటీలో చదివిన వారు 50 మంది ఉన్నారని తెలిపారు. ఇస్కాన్‌లో కూడా ఐఐటీ గ్రాడ్యుయేషన్ పొందిన వారు ఉన్నారన్నారు. తానెప్పుడు వేంకటేశ్వరస్వామినే నమ్ముతానని, తమ కుటుంబ ఆరాధ్య దైవం వేంకటేశ్వర స్వామి అని చెప్పారు. 2003లో తిరుపతిలో క్లెమోర్ మైన్స్ పేలినప్పుడు తనకు ప్రాణ భిక్ష పెట్టింది వేంకటేశ్వరస్వామి అని చెప్పారు.


గోకుల్ క్షేత్రంలో శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సీఎం చంద్రబాబు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, అక్షయపాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధు పండిత్, మంత్రి నారాయణ, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

ఆధ్యాత్మిక ఒరవడి: జస్టిస్ రమణ

అమరావతిలో నూతన ఆధ్యాత్మిక ఒరవడికి శ్రీకారం చుట్టడం శుభసంకేతమని సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ తెలిపారు. ఆధ్యాత్మికతతోపాటు సంస్కృతి, ఆచార వ్యవహారాలను కాపాడడం ముఖ్యమన్నారు. గోకుల క్షేత్ర నిర్మాణానికి చంద్రబాబు సారథ్యంలో మార్గం సుగమమైందన్నారు. ఎవ్వరూ అర్థాకలితో ఉండకూడదనే అక్షయ పాత్ర ద్వారా ఇస్కాన్ అన్నదానం చేస్తుందని చెప్పారు. అక్షయపాత్ర ద్వారా గతంలో అన్న క్యాంటీన్లకు ఇస్కాన్ సంస్థ తోడ్పాటు ఇచ్చిందన్నారు. అన్న క్యాంటీన్లను త్వరలో పునరుద్ధరించడం శుభపరిణామమని చెప్పారు.

ఉత్తమ నగరంగా అమరావతి : మధు పండిత్

ప్రపంచ ఉత్తమ నగరంగా అమరావతి నిలుస్తుందని అక్షయపాత్ర అంతర్జాతీయ అధ్యక్షుడు మధు పండిత్ తెలిపారు. ఉత్తమ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ వెలుగొందాలన్నారు. పాండవులు నడయాడిన అమరావతిలో నవయుగ ధర్మరాజుగా చంద్రబాబు రాజధాని అమరావతి నిర్మాణం తలపెట్టారన్నారు. అమరావతిలో గోకుల క్షేత్రం ప్రాజెక్టును 150 కోట్లతో నిర్మిస్తున్నామన్నారు.

అమరావతి.. ఆధ్యాత్మికం

హరేకృష్ణ గోకుల క్షేత్రంలో 6.5 ఎకరాల్లో వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణం జరుగుతుందని 216 అడుగుల ఎత్తున్న ప్రధాన గోపురంతో వేంకటేశ్వరస్వామి, రాధాకృష్ణ దేవాలయం నిర్మిస్తున్నారని, అమరావతిలో ఇదొక ఆధ్యాత్మిక కేంద్రంగా నిలుస్తుందన్నారు. కూటమి గెలుపుతో ప్రజల్లో సంతోషం నెలకొందన్నారు. తెలుగువారు నెంబర్ వన్‌గా ఉండాలని తాను కోరుకుంటానన్నారు. ప్రపంచంలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల్లో 30 శాతం మంది తెలుగువారు ఉండడం గర్వకారణమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక భూముల ధరలు పెరిగాయన్నారు. ఒక శాతం వృద్ధి రేటు పెరిగితే రాష్ట్రానికి 15 వేల కోట్ల ఆదాయం వస్తుందన్నారు.

అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ

అన్న క్యాంటిన్లకు భోజన సరఫరా బాధ్యతలను గతంలో అక్షయపాత్రకు తాను అప్పగించినట్లు చంద్రబాబు చెప్పారు. టీడీపీ హయాంలో రాష్ట్రంలో 203 అన్న క్యాంటీన్లు నాడు నిర్వహించగా గత ప్రభుత్వం మూసేసిందన్నారు. త్వరలో రాష్ట్రంలో అన్న క్యాంటీన్లను పునరుద్ధరిస్తామని ప్రకటించారు. శ్రీకృష్ణ ఆలయం ఉన్న పది కిలోమీటర్ల పరిధిలో ఎవరూ ఆకలితో ఉండకూడదని లాలా ప్రభుపాద స్ఫూర్తితో అక్షయపాత్రను ప్రారంభించారన్నారు. 23 ఏళ్లలో 400 కోట్ల మందికి భోజనం పెట్టారని చెప్పారు. వివిధ రాష్ట్రాల్లో పరిశుభ్రంగా నాణ్యతతో 22 లక్షల మందికి ప్రతి రోజూ అక్షయపాత్ర ద్వారా ఆహారాన్ని అందిస్తున్నారన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పెనుమత్స శ్రీనివాసరాజు, సక్కు గ్రూప్, యలమంచిలి కృష్ణమోహన్ గ్రూప్ రూ.కోటి చొప్పున ఇస్కాన్ సంస్థకు విరాళం ప్రకటించగా చంద్రబాబు వారిని అభినం దించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయులు, రాజ్యసభ సభ్యుడు రవీంద్రకుమార్, మంత్రి సవిత, మంత్రి నారాయణ, గోకుల క్షేత్ర, ఇస్కాన్ ప్రతినిధులు మధు పండిత్ దాస, సత్య గౌర చంద్రదాస, జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ తుషార్‌డూడి, మంగళగిరి సీనియర్ సివిల్ జడ్జి వై నాగరాజు, పలువురు అధికారులు స్థానిక ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎస్పీలు బదిలీ

- మూడు జిల్లాలకు మారారు
- బాపట్లకు గుంటూరు ఎస్పీ తుషార్‌డూడీ
- పల్నాడుకు శ్రీనివాసరావు
- గుంటూరుకు సతీష్‌కుమార్

గుంటూరు/ నరసరావుపేట, బాపట్ల జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని మూడు జిల్లాలకు ఎస్పీలు మారారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు ఎస్పీలను నియమించారు. ఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ ద్వారక తిరుమలరావు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 37 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేయగా వారిలో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ముగ్గురు ఎస్పీలు ఉన్నారు. గుంటూరు ఎస్పీ తుషార్ డూడీని బాపట్లకు మార్చగా, ఆయన స్థానంలో ఎస్ సతీష్‌కుమార్‌ను నియమించారు. గత ఎన్నికలకు ముందు నుంచి తుషార్ డూడీ గుంటూరు ఎస్పీగా పనిచేస్తున్నారు. 2016 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సతీష్‌కుమార్ ప్రస్తుతం కాకినాడ ఎస్పీగా ఉన్నారు. ఇప్పటివరకు బాపట్ల ఎస్పీగా ఉన్న వకుల్ జిందాల్‌ను విజయనగరం ఎస్పీగా నియమించారు. ఇక పల్నాడు ఎస్పీగా కే శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఆయన విజయవాడ రూరల్ డీసీపీగా ఉండగా ఆయన్ను పల్నాడు జిల్లాకు మార్చారు. ఇప్పటి వరకు పల్నాడు ఎస్పీగా విధులు నిర్వహించిన మల్లికాగర్గ్‌ను విజయ నగరం జిల్లా 5వ బెటాలియన్ కమాండెంట్‌గా నియ మించారు.


ఎస్పీ తుషార్ డూడీ (బాపట్ల జిల్లా)

ఇక త్వరలో డీఎస్పీలు, సీఐల వంతు

కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిగా శనివారం ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఎట్టకేలకు తాజాగా ఐపీఎస్‌ల బదిలీ ప్రక్రియ పూర్తి కాగా త్వరలో డీఎస్పీలు, ఆ తర్వాత సీఐల బదిలీలు ఉంటాయని సమాచారం. బదిలీల కోసం ఆయా అధికారులు ఎదురు చూస్తున్నారు. కొత్త ప్రభుత్వం కొలువుతీరి నెల రోజులు గడిచినా ఇంకా పాత సీఐలే ఆయా విధుల్లో కొనసాగుతున్నారు. దీనిపై పార్టీ కేడర్ నుంచే కాక ప్రజల నుంచి, సంబంధిత పోలీసు వర్గాల నుంచి కూడా కొంత వరకు అసంతృప్తి వ్యక్తమవుతుంది. ఐపీఎస్‌ల బదిలీల నేపథ్యంలో ఇక అదనపు ఎస్పీలు, డీఎస్పీలను రెండు, మూడు రోజుల్లో బదిలీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆ తర్వాత సీఐల బదిలీలు జరగనున్నాయని సమాచారం.

తుషార్‌డూడీకి రెండో పోస్టింగ్

2018 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి తుషార్‌డూడీ ఎస్పీగా తొలి పోస్టింగ్ గుంటూరు జిల్లా కాగా రెండో పోస్టింగ్ బాపట్ల జిల్లా. బాపట్ల ఎస్పీగా సుదీర్ఘకాలం పనిచేసిన వకుల్‌జిందాల్‌ను విజయనగరం జిల్లాకు బదిలీ అయ్యారు. జిల్లా ఆవిర్భావం తర్వాత వకుల్‌జిందాల్‌కు తొలిసారి ఎస్పీగా ఇక్కడే పోస్టింగ్ దక్కింది. 26 నెలలు పాటు వకుల్ జిందాల్ బాపట్ల ఎస్పీగా సేవలందించారు. అత్యంత కీలకమైన ఎన్నికల ఘట్టం కూడా ఆయన సారథ్యంలోనే ముగిసింది. వైసీపీ పాలనలో జిల్లాలు ఏర్పడ్డాక దాదాపు ప్రతి జిల్లాకు కొత్త ఎస్పీలను నియమించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఒకే చోట విధుల్లో ఉన్న ఎస్పీలు ముగ్గురు కాగా అందులో వకుల్ ఒకరు కావడం గమనార్హం.

కాకినాడ నుంచి గుంటూరుకు..

ప్రస్తుతం కాకినాడ జిల్లా ఎస్పీగా ఉన్న సతీష్ కుమార్ గుంటూరుకు బదిలీపై రానున్నారు. తమిళనాడులోని ఈరోడ్ ప్రాంతానికి చెందిన సతీష్ కుమార్ 2016లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం 2018లో మొదటిసారిగా చింతపల్లి ఏఎస్పీగా ఏడాదిన్నర విధులు నిర్వ హించారు. ఆ తర్వాత మావోయిస్టు కార్యకలాపాల అణచివేతకు సంబంధించి నర్సీపట్నం ఓఎస్‌డీగా 14 నెలలు, విశాఖ పరిధిలో సెబ్ ఏ ఎస్పీగా తొమ్మిది నెలలు, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా ఎస్పీగా 13 నెలలు పని చేశారు. 2023 ఏప్రిల్ నుంచి కాకినాడ ఎస్పీగా విధులు నిర్వహిస్తున్నారు. ఐపీఎస్‌గా సతీష్‌కుమార్ నాలుగేళ్లు మావోయిస్టు ప్రభావిత ప్రాంతంలో కీలక భూమిక పోషించారు. మావోయిస్టు కార్యకలాపాలను అణచి వేసే క్రమంలో సతీష్‌కుమార్ అనేక కార్యక్రమా లను చేపట్టి విజయవంతమయ్యారు. గంజాయి పెంపకం, అక్రమ రవాణా, విక్రయాలపై కూడా ఉక్కుపాదం మో పారు.

26 నెలలు.. నలుగురు ఎస్పీలు

పల్నాడు జిల్లా ఏర్పడి 26 నెలలు అవుతుంది. అయితే ఇప్పటి వరకు జిల్లాలో ముగ్గురు ఎస్పీలు పనిచేశారు. జిల్లాకు నాలుగో ఎస్పీగా కే శ్రీనివాసరావు నియమితులయ్యారు. 2017 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన శ్రీనివాసరావు విజయవాడ రూరల్ డీసీపీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై పల్నాడుకు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఇద్దరు ఎస్పీలు ఎన్నికల కమిషన్ చర్యలతో బదిలీ అయ్యారు. చిలకలూరిపేట బొప్పుడి వద్ద జరిగిన ప్రధాని మోదీ సభకు సంబంధించి భద్రతా వైఫల్యాల నేపథ్యంలో రవిశంకర్‌రెడ్డిని బదిలీ చేశారు. పోలింగ్, ఆ తర్వాత జిల్లాలో జరిగిన హింసాత్మక సంఘటలను పురస్కరించుకుని బిందు మాధవ్‌ను ఎన్నికల సంఘం సస్పెండ్ చేసింది. ఆ తర్వాత ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన మల్లికా గార్గ్ పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించారు.

శాంతి భద్రతలపై కఠిన వైఖరి - సతీష్‌కుమార్

శాంతి భద్రతలను పరిరక్షించే విషయంలో కఠిన వైఖరి అవలంబించనున్నట్లు ఎస్పీగా నియమితులైన సతీష్‌కుమార్ ఆంధ్రజ్యోతికి తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఏ ఒక్కరిని ఉపేక్షించేది లేదన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి ఏ సమస్య వచ్చినా తన దృష్టికి తీసుకువచ్చే అవకాశం కల్పిస్తానన్నారు. గంజాయి, డ్రగ్స్ వంటి వాటిని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు చేపడతామన్నారు.

రేపు విధుల్లో చేరే అవకాశం

ఎస్పీగా నియమితులైన సతీష్‌కుమార్ సోమవారం విధుల్లో చేరే అవకాశం ఉంది. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు కూడా చేసుకుంటున్నారు. అదే రోజు ఎస్పీ తుషార్‌డూడీ విధుల నుంచి రిలీవ్ కానున్నారు.


గుంటూరు అన్నదాన సత్రం

సత్రం.. సొంతం

- అన్నదాన సత్రంపై దళారుల పెత్తనం
- రూ.116 కోట్ల ఆస్తులపై అక్రమార్కుల కన్ను
- దాత స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తున్న దేవదాయశాఖ

గుంటూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పూర్వం రవాణా సదుపాయాలు అంతగా లేనప్పుడు దూర ప్రయాణాలు చేసే వారు వసతికి, భోజన సదుపాయాలకు ఇబ్బంది పడకుండా ఉండాలని నాడు ఓ దాత తలచాడు. అయితే నేడు ఆ దాత స్ఫూర్తికి విరుద్ధంగా అధికారులు అక్రమార్కులకు సహకరిస్తున్నారు. రూ.116 కోట్ల ఆస్తుల పరుల పాలవుతున్నా వాటిని సంరక్షించాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. అదే గుంటూరు అమరావతిరోడ్డులోని అన్నదాన సత్రం. ఈ సత్రంపై నేడు కొందరు దళారులు పెత్తనం చేస్తున్నారు. సొంతం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పూర్వం గుంటూరు మీదగా దూర ప్రాంతం నుంచి ప్రయాణించే వారికి వసతి, భోజన సౌకర్యాలకు తీవ్రంగా ఇబ్బంది పడేవారు. ఈక్రమంలో పాటిబండ్ల రఘుపతినాయుడు అనే దాత అమరావతి రోడ్డులోని 1.57 ఎకరాల స్థలాన్ని కేటాయించి సత్రం ఏర్పాటు చేశారు. దీని నిర్వహణకు పెద్దపాలెం, తూబాడు, పుల్లడిగుంట ప్రాంతాల్లో భూములను ఆయన కేటాయించారు. ఈ సత్రం 2020లో దేవదాయ శాఖలో కలిసింది. దీంతో నాటి దాత స్ఫూర్తికి విరుద్ధంగా ఇక్కడ కార్యకలాపాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ స్థలం లీజు పేరిట కబ్జాలకు గురవుతుంది. అనేకమంది దళారులు ఈ స్థలంపై కన్నేసి ఆక్రమించుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. సత్రాన్ని వ్యాపార సంస్థగా మార్చి పెద్ద ఎత్తున లీజులు ఇచ్చుకున్నారు. సత్రం స్థలాన్ని లీజు పేరట కబ్జా చేసేందుకు మరికొందరు ప్రయత్నిస్తున్నారు. దాత కుటుంబీకుల అనుమతి లేకుండా ఇష్టారాజ్యంగా ఫంక్షన్ హాలు, అనాథల ఆశ్రమాల పేరుతో భవనాలను నిర్మించారు. కేవలం నెలకు రూ.4 అద్దెగా నిర్ధారించి ఆ స్థలంలో అడ్డగోలు నిర్మాణాలకు ఎవరు అనుమతి ఇచ్చారో తెలియదు. ఇటీవల 550 గజాల స్థలానికి దేవదాయ శాఖ అధికారులు టెండర్లు నిర్వహించారు. ఆ టెండర్లు కూడా లోపభూయిష్టంగా జరిగినట్లు తెలుస్తుంది. దేవదాయ శాఖ ఉన్నతాధికారి ఒకరు ఈ సత్రానికి కమిటీ వేసి, తనకు నచ్చిన వ్యక్తిని ఈవోగా నియమించుకుని ఇష్టం వచ్చినట్లుగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. లీజు పేరట వచ్చిన వారు దళారులుగా ఏర్పడి, షాపులు ఖాళీ చేయకపోవడం, తక్కువ అద్దె చెల్లించడం జరుగుతున్నా దేవదాయశాఖాధికారులు వారికి సహకరిస్తున్నారే కానీ సత్రం ఆస్తుల రక్షణకు చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలున్నాయి. స్థలదాత వారసులు, అధికారులు సత్రానికి పూర్వ వైభవం తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారు.


పిడుగురాళ్ల: లెనిన్‌నగర్‌లోని మురుగుకాల్వల్లో పూడిక తీస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

డయేరియా వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు

- బాధితులకు మంత్రి పొంగూరి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పరామర్శ
- స్వయంగా కాల్వల్లో పూడిక తీసిన మంత్రి, ఎమ్మెల్యే

4లో..


గుంటూరు రూరల్ మండలంలో సాగు చేసిన పత్తి పంట

వర్షం.. హర్షం

- సమృద్ధిగా కురిసిన వర్షాలు
- సాగుకు సిద్ధమైన అన్నదాతలు
- పత్తి, వరి వైపు అధిక శాతం మొగ్గు
- పల్నాడులో ఇప్పటికే వేసిన పంటలకు ఊపిరి

గుంటూరు సిటీ, జూలై 13: వరుణుడు కరుణలేదు.. వాతావరణశాఖ చెప్పినట్లు వర్షాలు లేవు.. అదును తప్పుతోంది.. అని ఆందోళనలో ఉన్న అన్నదాతలను మురిపిస్తూ శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో అత్యధిక ప్రాంతాల్లో కరువుతీరా వర్షం పడింది. నాన్నుడు వానతో భూమి పదునెక్కింది. దుక్కి దున్ని సిద్ధంగా ఉంచుకున్న పొలాల్లో విత్తనాలు నాటేందుకు రైతులు సిద్ధమయ్యారు. నైరుతి రుతుపవనాలు వచ్చాక కొంత వాన కురిసినప్పటికీ పదును చాలదని రైతులు ఇన్ని రోజులు సాగుకు దూరంగా ఉన్నారు. తాజాగా కురిసిన వర్షాలకు పుడమి దాహం పూర్తిగా తీరడంతో నాట్లుకు రంగం సిద్ధమైంది. ప్రస్తుతం కురిసిన వాన గుంటూరు జిల్లాలోనే అధికంగా పడినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. పల్నాడులో గత వారం లో

కొన్ని మండలాల్లో అధిక వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాలపై ప్రస్తుతం వరుణుడు కరుణించాడు. బాపట్ల జిల్లాలో కూడా పంటల సాగుకు ప్రస్తుత వర్షపాతం సరిపోతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

దుగ్గిరాలలో అత్యధికం..

అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు దుగ్గిరాలలో 148.8 మి.మీ అధికశాతం వర్షపాతం నమోదైంది. గుంటూరు పశ్చిమలో 142.2, గుంటూరు తూర్పులో 136.2, తెనాలిలో 123.4, కొల్లిపరలో 115.8, చేబ్రోలులో 107, ఫిరంగిపురంలో 105, పెదకాకానిలో 103.4, వట్టిచెరుకూరులో 86.6, ప్రత్తిపాడులో 85.4, మేడికొండూరులో 80.6, పొన్నూరులో 48, పెదనందిపాడులో 42.4, తాడికొండలో 37.6, కాకుమానులో 37.2, మంగళగిరిలో 33, తుళ్లూరులో 29.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో 37.5, నూజెండ్లలో 21, పిడుగురాళ్లలో 18.5, శావల్యాపురంలో 17, నాదెండ్లలో 12, బెల్లంకొండలో 10, బాపట్ల జిల్లా అమర్తలూరులో 93.5, చెరుకుపల్లిలో 67.5, రేపల్లెలో 41.5, నిజాంపట్నంలో 38, నగరంలో 33, చీరాలలో 26.25 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్లు అధికారులు ప్రకటించారు.

అన్ని పంటలకు అనుకూలమే..

ప్రస్తుతం కురిసిన వర్షంతో అన్ని పంటలు సాగు చేసుకునే అవకాశం ఏర్పడింది. భూమి పదునెక్కడంతో తాడికొండ, ప్రత్తిపాడు, పెదనందిపాడు, ఫిరంగిపురం మండలాల్లో పత్తి సాగుకు రైతులు సమాయత్తమయ్యారు. పొన్నూరు, తెనాలి, మంగళగిరి ప్రాంతాల్లో రైతులు వరి నారుమళ్లు సిద్ధం చేసుకుం టున్నారు. పల్నాడు జిల్లాలో ఇప్పటికే చాలా ప్రాంతాల్లో పత్తి సాగుతో పాటు, మిరప నారుమళ్లు పోశారు. బాపట్ల జిల్లాలో వరి నారుమళ్లు సిద్ధం చేస్తున్నారు.


అరక దున్నుతున్న రైతు

ఎట్టకేలకు 12 రైళ్లకు అదనపు జనరల్ బోగీలు

● రిజర్వుడ్ తరగతుల బోగీలపై తగ్గనున్న భారం

గుంటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): కొవిడ్ లాక్‌డౌన్ తర్వాత ఎక్స్‌ప్రెస్ రైళ్లను నామమాత్రం జనరల్ బోగీలతో నడుపుతూ సాధారణ ప్రయాణీకులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తున్న రైల్వేశాఖ ఎట్టకేలకు వాటిసంఖ్యని పెంచాలని నిర్ణయించింది. గుంటూరు మీదగా ప్రయాణించే 12 ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనపు జనరల్ బోగీలు జతచేస్తారు. దీనివల్ల జనరల్ బోగీల్లో ప్రయాణించేవారికి కాస్త ఉపశమనం లభించనుంది. వచ్చే వారం నుంచి ఈ బోగీలను జోడించి నడపనున్నట్లు రైల్వేశాఖ ప్రకటించింది. వాటిల్లో సికింద్రాబాద్-హౌరా, హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా ఎక్స్‌ప్రెస్, కాకి నాడపోర్టు-భావనగర్, భావనగర్-కాకినాడపోర్టు వీక్లీఎక్స్‌ప్రెస్, సికింద్రాబాద్-భువనేశ్వర్, భువనేశ్వర్-సికింద్రాబాద్ విశాఖఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-యశ్వంత్‌పూర్, యశ్వం త్‌పూర్-మచిలీపట్నం కొండవీడుఎక్స్‌ప్రెస్, మచిలీపట్నం-ధర్మవరం, ధర్మవరం-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్, కాకినాడపోర్టు-ఎల్‌టీటీ(ముంబై), ఎల్‌టీటీ-కాకినాడపోర్టు ఎక్స్‌ప్రెస్‌లున్నాయి.

ప్రస్తుతం ఈ రైళ్లు కేవలం రెండు జనరల్ బోగీలతో నడుస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ఒకటి ముందు, మరొకటి వెనక భాగంలో ఉంటున్నాయి. మరికొన్ని సందర్భాల్లో రెండు బోగీలూ పక్కపక్కనే ఉంటున్నాయి. దీనివల్ల ప్రయాణీకులు గందరగోళానికి గురౌతున్నారు. మరోవైపు రైళ్లరద్దు కారణంగా ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని స్లీపర్‌క్లాస్, కొన్ని సందర్భాల్లో ఏసీ బోగీల్లోనూ జనరల్ టిక్కెట్‌తో ఎక్కి టీటీఈలతో ఈఎఫ్‌టీలు రాయించుకొని ప్రయాణిస్తున్నారు. దీనివల్ల ఆయా బోగీల్లో కన్‌ఫర్మ్ బెర్తుల ప్యాసింజర్లకు తీవ్ర అసౌకర్యంగా ఉంది. కనీసం టాయ్‌లెట్స్‌కు వెళ్లలేని పరిస్థితి. దొంగతనాలు జరిగినా నేరస్తులను గుర్తించలేని పరిస్థితులు తలెత్తాయి. ఇటీవల విశాఖ ఎక్స్‌ప్రెస్‌లో గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మిర్యాలగూడ వద్ద మహిళ ప్రయాణీకురాలిపై ఒడిస్సాకు చెందిన ప్రయాణీకుడు అసభ్యకరంగా ప్రవర్తించి రైల్లో నుంచి కిందికి తోసేశాడు. ప్రమాదంలో ఇద్దరు కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఇలాంటి సంఘటనలు నిత్యకృత్యంగా మారాయి. దీనిపై ఇప్పటికే రైల్వేమంత్రికి ట్విట్టర్‌లో అనేక ఫిర్యాదులందాయి. దీంతో దిద్దుబాటు చర్యగా జనరల్ బోగీలను పునరుద్ధరించారు. ప్రతీ రైలులో కనీసం 4 జనరల్ బోగీలు ఉండబోతున్నాయి. వీటిల్లో రెండు ముందు, రెండు వెనక ఉండే అవకాశం ఉన్నది. వీటికి అదనంగా మహిళలు, దివ్యాంగులు, వృద్ధుల కోసం ఒక ఎస్ఎల్ఆర్ బోగీ ఉంటుంది.

డయేరియా వ్యాప్తిని అరికట్టేందుకు చర్యలు

● బాధితులకు మంత్రి నారాయణ, యరపతినేని పరామర్శ

● స్వయంగా కాల్వల్లో పూడిక తీసిన మంత్రి, ఎమ్మెల్యే



లెనిన్‌నగర్ ఆసుపత్రిలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, అధికారులు

పిడుగురాళ్ల, జూలై 13: పిడుగురాళ్ల పరిసర ప్రాంతాలలో డయేరియా వ్యాప్తిపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి ప్రజారోగ్యానికి నష్టం కలుగకుండా అన్నిచర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ అన్నారు. లెనిన్‌నగర్ ఆసుపత్రిలో డయేరియా బాధితులను పరామర్శించిన అనంతరం లెనిన్‌నగర్, మారుతీనగర్ కాలనీలలో పర్యటించి రెండు రోజుల క్రితం వున్న పారిశుధ్య స్థితిగతులు, శనివారం సాయంత్రం వున్న స్థితిని స్వయంగా మంత్రి పర్యవేక్షించారు. పలుచోట్ల కాల్వల్లో వున్న పూడికను మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావులు స్వయంగా తొలగించారు. మొదట డయేరియాకు కారణమైన నీరు కలుషితమైనట్లుగా గుర్తించిన బోరును పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఐదేళ్లుగా మా ప్రాంతాలను పట్టించుకోలేదు : మహిళల మొర

టీడీపీ సానుభూతిపరులకు చెందిన కాలనీ అని ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం మమ్మల్ని, మా ప్రాంత అభివృద్ధిని పట్టించుకోలేదని లెనిన్‌నగర్, మారుతీనగర్ ప్రాంతాల మహిళలు మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. ఐదేళ్లలో పారిశుద్ధ్యం అనేది పట్టించుకోలేదని, వాటర్ ట్యాంక్‌ను ఒక్కసారి కూడా శుభ్రంచేసిన దాఖలాలు లేవన్నారు. అదేమని అడిగితే టీడీపీ వారంటూ నిందలు వేశారని మహిళలు పేర్కొన్నారు. యరపతినేని స్పందిస్తూ పారిశుద్ధ్యానికి ఖర్చుచేయాల్సిన నిధులు కూడా నొక్కేయడం వల్ల ఇప్పుడు ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రస్తుతం డయేరియాను అదుపులోకి తెచ్చేందుకు అన్నిచర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.



లెనిన్‌నగర్ కాల్వలో పూడికతీస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

ప్రజల ఆరోగ్యానికే ప్రాధాన్యం

● అన్ని ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుకు చర్యలు

● అధికారుల సమీక్షలో మంత్రి నారాయణ, ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 13: కూటమి ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తుందని రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరి నారాయణ స్పష్టం చేశారు. శనివారం పిడుగురాళ్ల ఆర్ అండ్‌బీ బంగ్లాలో మున్సిపల్, వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం మెరుగుకు అన్ని చర్యలు చేపట్టామని, సీజనల్ వ్యాధుల పట్ల ముందస్తు జాగ్రత్తగా అన్ని ప్రాంతాలలో మురుగుకాల్వల్లో పూడికతీత చేపట్టడంతో పాటు పరిశుభ్రమైన నీటిని అందిస్తామన్నారు. డయేరియా ప్రబలిన లెనిన్‌నగర్, మారుతీ నగర్‌లో 8 పవర్‌బోర్లు, 36 చేతిపంపులు వున్నట్లు గుర్తించామని, వాటిల్లో నీటిశాంపిల్స్‌ను సేకరించామన్నారు. కొన్ని బోర్లలో నీటికా లుష్యం వున్నట్లు గుర్తించడం వల్ల తాత్కాలికంగా ఆ బోర్ల వాడకాన్ని అధికారులు నిలిపివేశారన్నారు. సీఎం చంద్రబాబునాయుడు కూడా శనివారం ఉదయం పిడుగురాళ్లలో డయేరియా విషయంపై అధికారులతో రివ్యూ చేశారని, ఎమ్మెల్యే యరపతినేనితో కూడా ఆయన మాట్లాడారన్నారు. డయేరియాను అదుపుచేసేందుకు అన్నిచర్యలను ప్రభుత్వం తీసుకుంటుందని, తక్షణమే రూ.10లక్షల నిధులు పారిశుధ్యానికి కేటాయించినట్లు మంత్రి వివరించారు. పిడుగురాళ్లలోని అన్ని కాల్వల్లో పూడికతీత చేపడతామని, అన్ని చేతిపంపుల్లో నీటి శాంపిల్స్‌ను తీసుకుంటున్నామన్నారు. కోనంకి గ్రామంలోనూ డయేరియా ప్రబలిందని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. అన్ని ప్రాం తాలలో పారిశుధ్యం మెరుగుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. సమీక్షలో మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, డీఎంహెచ్ఓ రవి, తహసీల్దార్ శ్యాంసుందరరాజు, యరపతినేని నిఖిల్, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, కమిషనర్ గిరికుమార్, ఏఈ రామవేంద్ర, పలు శాఖల అధికారులు, నాయకులు వున్నారు.



ఉద్యోగావకాశాలు

➻ లేడీ ఫిజియోథెరపిస్ట్ కావలెను. సంప్రదించండి సెల్ నెంబర్ : 75698 79199, గుంటూరు.
AJG-191494

➻ గుంటూరులోని శుభం డెవలపర్స్ రియల్ ఎస్టేట్ సంస్థ నందు పనిచేయుటకు Tally నందు అనుభవం కలిగిన అకౌంటెంట్స్ కావలెను. వివరాలకు సంప్ర॥ 9703777458.
AJG-184777

➻ ARIES AGRO LTD (CMPL), Guntur, Need Accountants (M.Com) with 3Yr. Exp. Attend Interview on 15-07-2024 at CMPL, Raja's Garden, Guntur. Ph: 9030720095, Email: staffbala5@gmail.com
SJAA-131

➻ ARIES AGRO LTD (CMPL), Guntur, Need Drivers with 3Yr. Exp. Attend Interview on 15-07-2024 at CMPL, Raja's Garden, Guntur. Ph: 9030720095, Email: staffbala5@gmail.com
SJAA-129

➻ మంగళగిరి పరిసర ప్రాంతాలలో ప్రముఖ పురుగు మందు కంపెనీలో పని చేయుటకు యువకులు కావలెను. Q: డిగ్రీ, జీతం : 15000, TA+DA_3000, (టూ వీలర్ కావలెను). సంప్ర॥ 81850 46367.
AJG-191612

➻ తెనాలిలో RR ఫర్నీచర్ షాపు నందు పనిచేయుటకు యువకులు కావలెను. అర్హత : 10th, సంప్ర॥ సెల్ : 9966029044
AJG-191362

➻ ప్రభావతి మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ & మెడికల్ షాపు నందు పనిచేయుటకు నర్సింగ్ స్టాఫ్ కావలెను. హాస్టల్ సదుపాయం మరియు ఆకర్షణీయమైన జీతం ఇవ్వబడును. సంప్ర. 98492 30580, అడ్రస్ : 1/4, రామన్నపేట, కొరిటెపాడు, గుంటూరు
RK-1252

➻ Hindi Subject Teacher Wanted from 6th to 10th Classes Hindi Subject Teaching. Free Boarding and Lodging. Contact immediately, Sri Raghavendra High School, Kurichedu, Cell: 9490327336
AJO-190347

➻ ప్రముఖ META SHOT కంపెనీ (MIXED REALITY BAT)కు A.P. లోని అన్ని జిల్లాలకు డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. సం.ప్ర. సెల్: 70321 74231, 80964 90964
AJR-2674

వధువు కావలెను

➻ కుల పట్టింపు లేదు / 35 సం. / ఏకైక కుమారుడు / MBA/ ప్రైవేట్ ఉద్యోగం / ఎత్తు 5.5 / తల్లిదండ్రులు లేరు. ఏ బాదరబందీలేని అందమైన అబ్బాయికి 1వ & 2వ వధువు కావలెను. Cont.:7899598848
AJH-001974

OLD AGE HOME

➻ ఒమేగా హోమ్ కేర్ వంట/ ఇంటి పని, వృద్ధులకు, పేషంట్లని, చిన్నపిల్లలను 24 గం. చూసుకొనుటకు మీ ఇంటి వద్దకే కేర్ టేకర్స్‌ని పంపబడును. హైదరాబాద్. 9951299000 / 9951355000
AJH-15771

జ్యోతిష్యాలయము

➻ హస్తసాముద్రికము (హ్యాండ్-రీడింగ్) ప్రశ్నా జాతకము - గృహ వాస్తు నాకు సాధ్యమైన వరకు చెప్పగలను. అప్పికట్ల వెంకటేశ్వరరావు సిద్ధాంతి, చినరావూరు పార్కు వద్ద, తెనాలి, సెల్ : 9441452404
AJG-191199

అమ్మకము

➻ గుంటూరు జిల్లా, కొల్లిపర (మం), కొల్లిపర గ్రామంలో 1.5 ఎకరం మాగాణి అమ్మకానికి కలదు. సంప్రదించండి సెల్ నెం : 9177229995
AJG-191487

➻ 15.00 ఎకరాల భూమి అమ్మకమునకు (ఏక ఖండము) గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలము నందు వరగాని టు కట్టెపాడు మధ్య 15.00 ఎకరాల నల్లరేగడి భూమి ఏకఖండముగా ఉన్నది. యస్.యస్.పి పంట కాల్వ ద్వారా నీటి వసతి కలదు. ఈ భూమి అరుతడుల కొరకు భూమిలో పైప్ లైనులు, వాల్ సిస్టము కూడా కలదు. ఈ పొలము గుంటూరు టు పెదనందిపాడు ఆర్ & బి రోడ్డులో వరగాని వద్ద నుండి పొన్నూరు ఆర్ & బి రోడ్డులో (2) రెండు కిలోమీటర్ల దూరములో కలదు. పొన్నూరు ఆర్ & బి రోడ్డుకు 200 అడుగుల దూరములో 70 లింకుల డొంక ద్వారా కలదు. కావున కొనదలచిన వారు ఈ సెల్ నెంబరు ద్వారా సంప్రదించవలసినది 98494 70620.
AJG-191492

రియల్ ఎస్టేట్

➻ అమరావతి రాజధాని పరిధిలో లింగాపురం, రావెపాడు, కంతేరు, లాం, పెద్దపరిమి ప్రాంతాలలో CRDA అప్రూవ్డ్ & నాన్ అప్రూవ్డ్ ప్లాట్లు అతి తక్కువ ధరకే స్పాట్ రిజిస్ట్రేషన్ కలదు. రేట్లు పెరగకముందే త్వరపడండి. సంప్ర॥ 88863 55955, 88868 55355.
AJG-184775

➻ గుంటూరు, బెజవాడ, Hyd, మంగళగిరి, కాజా, పెదకాకాని, గోరంట్ల, లాం, GPR, జనచైతన్య, రామకృష్ణ, OK సిటీ, మెగా సిటీ, రాజధాని ప్లాట్స్, పొలాలు అ/కొ. స్పాట్ రిజిస్ట్రేషన్. సంప్ర॥ 86390 01165, 98494 73838.
AJG-191460

➻ గుంటూరు, గోరంట్ల, రెడ్డిపాలెం, లాం, ఇన్నర్ రింగ్‌రోడ్, అమరావతి రాజధాని పరిధిలో పొలములు, ప్లాట్లు అమ్మదలచిన, కొనదలచిన వారు సంప్రదించగలరు. కె. రాజా. 9169446789.
SAAA-762

➻ గుంటూరు సిటీ, గోరంట్ల, లాం, రెడ్డిపాలెం, వెనిగండ్ల, అగతవరప్పాడు, పెదకాకాని, కొప్పురావూరు, నంబూరు, కంతేరు, కాజా మరెక్కడైనా ప్లాట్లు అ/కొ. సంప్ర॥ జనచైతన్య ప్లాట్లు మా ప్రత్యేకత. ఫోన్ : 73823 96677
SAAA-763

➻ AP రాజధాని అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ప్లాట్లు అమ్మదలచిన వారు సంప్రదించగలరు. (నో మీడియేటర్స్) ✆ 81429 75999.
AJB-194779

స్థలం అమ్మకము

➻ బాపట్ల జిల్లా దైవాలరావూరు గ్రామం (మేదరమెట్ల దగ్గర) ఎ.19.0 సెం. వ్యవసాయ భూమి అమ్మబడును. సం.నం. 9989157441/ 9908862323
AJH-001997

ఇన్నర్ రింగ్ రోడ్

➻ రెడ్డిపాలెం, శాంతి అర్ట్స్ ప్రక్క రోడ్డున ఆంజనేయులు కాలనీ, సిమెంట్ రోడ్డు నందు 252 చ॥గజాల దక్షిణము ఫేస్ ఖాళీ స్థలము అమ్మకమునకు కలదు. ఫోన్: 8297941638.
AJG-184776

PLOT FOR SALE

➻ గుంటూరు నుండి 5 కి.మీ. చ.గజం రూ. 10,500/- మాత్రమే. పెదకాకాని ఊరులో ఉన్న తక్షణమే ఇంటి నిర్మాణానికి అనువైన వెంచర్. 24గం. రవాణా సౌకర్యం. సంప్ర॥ 83175 28192
AAA-9491

➻ గుంటూరు, ఇన్నర్ రింగ్‌రోడ్, ఫేస్-1, డెకాత్‌లన్ షోరూం దగ్గర, ఖాళీ స్థలం 303 చ॥గ॥ (65X42) ఉత్తరం ఫేసింగ్ అమ్మకమునకు కలదు. సంప్ర॥ 9441382922.
SVA-30

➻ రియల్ ఎస్టేట్‌లో ఇన్వెస్ట్‌మెంట్ అంటేనే తక్కువ రేటుతో ఎక్కువ గజాలు కొనటం ! మరియు భవిష్యత్తులో గ్యారెంటీ రిటర్న్స్ కలిగిన చిలకలూరిపేట ప్రాంతంలో చ.గ.3 వేల నుండి 7 వేల వరకు లభించును. సంప్ర ॥ 83411 83101
NA-127

➻ రాజదాని గుంటూరు, విజయవాడలో 15 వెంచర్లలో CRDA ప్లాట్స్ పూలింగ్ ల్యాండ్స్, అపార్ట్‌మెంట్స్, పొలాలు, ఫామ్ ల్యాండ్స్ మీకు అందుబాటు ధరలలో కలవు. సెల్ : 9390451999
AJO-183943

➻ హైదరాబాద్ హయత్‌నగర్, కుంట్లూరు, పసుమాముల, గౌరెల్లి, తారామతి పేట్, పెద్ద అంబర్ పేట, అబ్దుల్లాపూర్, పోచంపల్లి శ్రీమిత్ర, కోహెడల్లో ప్లాట్లు కొనబడును. సెల్ : 9391125860/ 9866288866
AJH-002431

ఇల్లు అమ్మకము

➻ తెనాలి సంఘం జాగర్లమూడి 156 గ.లలో నూతనంగా నిర్మించి గృహప్రవేశానికి సిద్ధంగా ఉన్న కొత్త డాబా ఇల్లు అమ్మకమునకు కలదు. సెల్ : 9949619655.
AJG-191359

FLAT FOR SALE

➻ E/F 2BHK Flat in Lotus Landmark (Gated Community), Ayodhya Nagar, Vijayawada for sale. Contact : 9490690949.
AJG-191495

➻ మిధున ఎన్‌క్లేవ్ సొసైటీ కాలనీ, E/F, W/F ఫ్లాట్స్ 1800 చ॥అ॥ 4 ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ఇన్నర్ రింగ్ రోడ్డుకి దగ్గర, గుంటూరు. రెడీ టు ఆక్యుపై. సంప్ర॥ 9989488410.
AAA-9494

➻ గుంటూరు, ఇన్నర్ రింగ్‌రోడ్డు భగత్‌సింగ్ బొమ్మ దగ్గరలో రెడీ టూ ఆక్యుపై 3BHK-2400 Sft, 2BHK-1150 sft, ఫుల్లీ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ అమ్మకం. సంప్ర॥ 9490960449.
AA-890

➻ గుంటూరు, కొరిటెపాడు సాయిబాబా రోడ్, 4వ లైన్‌లో శ్రీభార్గవ కన్‌స్ట్రక్షన్స్ నందు 1150 2BHK & 1660 3BHK ఫ్లాట్స్ ఫుల్ ఫినిషెడ్, రెడీ టు ఆక్యుపై. సంప్ర॥ 79894 56509, 95427 57575.
AAA-9242

➻ గుంటూరు, విద్యానగర్ 3/10వ లైన్‌లో శ్రీభార్గవ కన్‌స్ట్రక్షన్స్ నందు 2800 చ॥అ॥ల 3BHK ఫ్లాట్స్ ఫుల్ ఫినిషెడ్, రెడీ టు ఆక్యుపై. సంప్ర॥ 79894 56509, 95427 57575.
AAA-9243

అద్దెకు

➻ గుంటూరు, అరండల్‌పేట, 13/2వ లైనులో ఫ్యామిలీ పోర్షన్ అద్దెకు యివ్వబడును. Cont : 94934 45394, 9866391117 (Call before 2.00 PM & After 5.00 PM).
AJG-191491

➻ గుంటూరు, శ్యామలనగర్, 3వ లైన్ X టెన్షన్, బాల కుటీర్ స్కూల్ దగ్గర ఇండిపెండెంట్ హౌస్, 1st ఫ్లోర్, ఈస్ట్ ఫేస్ 2 B/R అన్ని వసతులతో అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 77021 23808.
AJG-191471

➻ GNT - VJA, NH-16 Hi-Way, T-Junction, Between tollgate Murugan (మంగళగిరి కాజా) G+2 = 5350 Sft, Lift, Parking, Rent - Sale. Cont : 6302114341.
AJG-191482

➻ గుంటూరు, బృందావన్ గార్డెన్స్ సెంటర్‌లో అమరావతి ఫుడ్ కోర్టు పైన 2వ ఫ్లోర్‌లోని షాపు వ్యాపారములకు అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 7036430653, 7993564165.
AJG-191503

బిల్డింగ్ డిమాలిష్

➻ పాత బిల్డింగ్స్, పెంకుటిళ్ళు, రేకుల షెడ్లు, పగలకొట్టబడును మరియు పాత కలప, ఐరన్ రేకులు, సిమెంట్ రేకులు కొనబడును. ఫోన్ : 9849481424, 80746 77449.
AJG-191502

➻ పాత బిల్డింగ్‌లు, పెంకుటిల్లు, రేకుల షెడ్‌లు పగుల గొట్టబడును. పాత కలప, కిటికీలు, పాత ఐరన్ కొనబడును. వెంటనే సంప్ర॥ 97032 90782, 9700442419
SAAA-757

బోర్ వెల్స్

➻ విజయ బోర్ వెల్స్ : 4-1/2, 6-1/2; 7" & 8" అంగుళం బోర్లు & క్లీనింగ్ సరసమైన ధరలకు వేయబడును. సంప్ర॥ హరిహర మహల్ ఎదురుగా L.V.R. క్లబ్ ప్రక్కన, గుంటూరు. సంప్ర॥ 98662 22717, 98481 83887.
AAA-9484

చెదల నివారణ

➻ చెదపురుగులు, బొద్దింకల నివారణ 5 సం॥ గ్యారంటీ. AN ISO 9001-2015 సర్టిఫైడ్ కంపెనీ లాన్సర్ పెస్ట్ కంట్రోల్, పట్నం బజార్, గుంటూరు. ఫోన్ : 8978672824, 9848131213
SAAA-774

EDUCATION

➻ లాంగ్ టర్మ్ కోచింగ్ ఫర్ EAPCET-2025 (AP&TS), అత్యుత్తమ ఫ్యాకల్టీచే విద్యాబోధన. హాస్టల్ వసతి కలదు. ఇంటర్ ట్యూషన్స్ చెప్పబడును. శ్రీ దివ్య ఇన్‌స్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. సెల్ : 73967 55801.
NAM-136

➻ ఓపెన్ 10th, ఇంటర్ మరియు B.A, B.Com, B.Sc, M.A, M.Com, M.Sc, MBA, MCA లకు ఉత్తమ శిక్షణ ఇవ్వబడును. సంప్ర॥ శ్రీ దివ్య ఇన్‌స్టిట్యూషన్స్, 2/3, అరండల్‌పేట, గుంటూరు. సెల్ : 73967 55801.
NAM-93

➻ BPT - 4 1/2 సం./ B.Sc. MLT 3 సం.లు/ డిప్లొమా ఇన్ MLT, Anesthesia, Radiographic Asst., Med. Imaging, O.T. Tech, Dialysis, CARDIOLOGY - 2 సం.లు కోర్సులు. అర్హత : ఇంటర్ Bi.P.C/Any Group - ASIAN COLLEGE, VIJAYAWADA. 76800 65835, 90636 15623.
AJB-194738

పతనమైన ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దుకోవాలి

● రూ.14లక్షల కోట్ల అప్పులు పెరిగాయి ● ఏపీ ప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరి డాక్టర్ పి.వి.రమేష్



ప్రసంగిస్తున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 13: రాష్ట్రంలో గత ఐదేళ్ల కాలంలో ఆర్థికవ్యవస్థ పతనమైందని, రూ.14లక్షల కోట్లకు అప్పులు పెరిగాయని రాష్ట్రప్రభుత్వ పూర్వ స్పెషల్ చీఫ్‌సెక్రటరీ డాక్టర్ పి.వి.రమేష్ పేర్కొన్నారు. శనివారం గుంటూరులో జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో "ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి కార్యాచరణ" అనే అంశంపై జరిగిన చర్చాగోష్ఠికి వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ప్రధాన వక్తగా డాక్టర్ పి.వి.రమేష్ ప్రసంగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పులపై ప్రతిరోజు రూ.75కోట్ల వడ్డీ చెల్లిస్తున్నామని, మరో రూ.175కోట్లు ప్రతిరోజు అప్పులు చేసే దుస్థితికి రాష్ట్ర ఆర్థికవ్యవస్థ దిగజారిందన్నారు. గత ప్రభుత్వం చట్టబద్ధ దోపిడీ చేస్తూ మోసపూరిత వ్యాపారసంస్థగా మారిందన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థలో 80శాతం ఉద్యోగులకు ఎలాంటి పని ఉండటం లేదన్నారు. రాష్ట్రంలో రాజకీయపార్టీలు ప్రజలను కులాల ప్రాతిపదికగా విభజించి ఓట్లు పొందాలని భావిస్తున్నాయన్నారు. వ్యవసాయం, పారిశ్రామికరంగాలలో ఉత్పాదకతను పెంచి, దళారి వ్యవస్థను తొలగించాలన్నారు. మట్టి, ఇసుక, మైనింగ్ లాంటి సహజ వనరులను గత పాలకులు దోచుకుని అవినీతిని తారస్థాయికి తీసుకెళ్లారన్నారు. రాష్ట్రంలో ఒక్కశాతం జనాభా చేతిలో 44శాతం ఆస్తులు, 24శాతం ఆదాయం ఉందని, అట్టడుగున ఉన్న 50శాతం ప్రజలకు కేవలం 5 శాతం ఆస్తులే ఉన్నారన్నారు. ఇంకా మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు పి.రామచంద్రరాజు, దళిత బహుజనఫ్రంట్ వ్యవస్థాపకుడు కొరివి వినయ్‌కుమార్, మానవతసంస్థ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీనివాసరావు, ఛైర్మన్ పావులూరి రమేష్, ఆర్థికశాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ అబ్బరాజు రాజశేఖర్, ఎం.కోటేశ్వరరావు, మేకల రవీంద్రబాబు, రమణబాబు తదితరులు ప్రసంగించారు.

భారీఎత్తున పట్టుబడిన రేషన్ బియ్యం

● పరారైన మిల్లు యజమాని



మిల్లులో పట్టుబడిన లారీ వద్ద సీఎస్‌డీటీ పద్మజ, ఆర్ఐ శివ, టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ, ఇతర నాయకులు

వట్టిచెరుకూరు, జూలై 13: మండలంలోని చమళ్లమూడి గ్రామంలో గల రైస్‌మిల్లులో శనివారం పీడీఎస్ రైస్ బ్యాగుల లోడు చేసిన 10 టైర్ల లారీని టీడీపీ మండల అధ్యక్షుడు మన్నవ పూర్ణచంద్రరావు, వివిధ విభాగాల అధ్యక్షులు, నాయకులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని సివిల్ సప్లయ్, పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. లారీలోని పీడీఎస్ రైస్ బ్యాగులతో పాటు మిల్లులో ఉన్న రైస్‌ను బ్యాగుల్లో నింపుతున్నారు. ఆ సమయంలో మిల్లు యజమాని గుంటూరు నగరానికి చెందిన సుబ్బారావు పరారు కాగా వట్టిచెరుకూరు సీఐ ఉదయ్‌బాబు, ఎస్సై వినోద్‌బాబు, సిబ్బంది అతన్ని పట్టుకునేందుకు గుంటూరు వైపు వెళ్లారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో చమళ్ళమూడి మిల్లును కొనుగోలు చేసిన సుబ్బారావు ఈ ప్రాంతంలో పీడీఎస్ రైస్‌ను సేకరించి మిల్లుకు చేర్చి ఇక్కడ నుంచే పెద్దఎత్తున రవాణా చేస్తూ పెద్ద మాఫియాగా ఎదిగాడు. అతనికి గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతల అండ పుష్కలంగా ఉండటంతో యథేచ్ఛగా పీడీఎస్ రైస్‌ను తరలించేవాడు. పలుమార్లు స్వల్ప మొత్తంలో పీడీఎస్ రైస్ రవాణాకి సిద్ధంగా ఉన్న సమయంలో గ్రామస్తుల సమాచారంతో రెవెన్యూ, పోలీస్ అధికారులు దాడులు చేసి రైస్ లారీలను పట్టుకొన్నారు. అయితే తుతుమంత్రంగా కేసులు నమోదు చేసి చేతులు దులుపుకొన్నారనే విమర్శలు ఉన్నాయి. ఆ మిల్లు జోలికెళితే ఉద్యోగాలకు ఎక్కడ ముప్పు వస్తుందోనని అధికారులు, ఎక్కడ కేసులు పెట్టి వేధిస్తారోనని గ్రామస్తులు మిన్నకుండిపోయారు. గత కొద్ది రోజులుగా రైసుమిల్లుపై టీడీపీ నాయకులు నిఘా పెట్టి రవాణాకు సిద్ధంగా ఉన్న లారీలు మిల్లు ప్రాంగణంలో ఉండటంతో టీడీపీ మండల అధ్యక్షులు పూర్ణచంద్రరావు సివిల్ సప్లయ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగానికి సమాచారం ఇచ్చారు. మన్నవ పూర్ణచంద్రరావుతో పాటు, ఎస్సీ సెల్ అధ్యక్షులు లక్ష్మయ్య, గ్రామపార్టీ అధ్యక్షులు అంకపూడి మురళి, కాట్రపాడు పార్టీ అధ్యక్షులు సాంబశివరావు, యువత అధ్యక్షులు ఎస్ నాగరాజు, మన్నవ గోపిలు ఉండగా సివిల్ సప్లయ్ డీటీ పద్మజ, ఆర్ఐ శివ, సీఐ ఉదయ్‌బాబు, ఎస్ఐ వినోద్‌బాబు, సిబ్బంది రైస్ మిల్లు వద్దనే ఉండి మిల్లులోని బావుల్లో ఉన్న బియ్యాన్ని బ్యాగులకు ఎత్తిస్తూ మొత్తం స్టాకును ఎక్కించే పనిలో పడ్డారు.



ఎమ్మెల్యేలను సత్కరిస్తున్న కళాదర్బార్ సభ్యులు, పాల్గొన్న టీడీ జనార్దన్ తదితరులు

వేడుకగా ఎన్టీఆర్ ప్రతిభా పురస్కారాల ప్రదానం

గుంటూరు(తూర్పు), జూలై 13: స్థానిక శ్రీవెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఎన్టీఆర్ 101వ జయంతి వేడుక సందర్భంగా కళాదర్బార్- అమరావతి వ్యవస్థాపక అధ్యక్షుడు పొత్తూరి రంగారావు ఆధ్వర్యంలో ఎన్డీఏ కూటమి ప్రజాప్రతినిధులకు ఎన్టీఆర్ ప్రతిభ పురస్కారాల ప్రదానోత్సవం శనివారం వేడుకగా జరిగింది. తొలుత ఏర్పాటుచేసిన సంగీత విభావరి ఆకట్టుకుంది. ఎన్టీఆర్ నటించిన పాటలను గాయనీగాయకులు శైలజ, సౌజన్య, పావని, రసూల్‌బాబు, సుధీర్‌బాబు, హరికిషన్, ప్రవీణ్‌కుమార్ ఆలపించారు. అనంతరం విచ్చేసిన అతిథులు, ప్రజాప్రతినిధులు ఎన్టీఆర్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్ధన్, అడ్వకేట్ టీడీపీ అధికార ప్రతినిధి రామకృష్ణ ప్రసాదు, ప్రముఖ నిర్మాత ఆర్ వెంకటేశ్వరరావు, ముప్ప ప్రైవేట్ లిమిటెడ్ వెంకయ్య చౌదరి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, మహమ్మద్ నసీర్, డాక్టర్ సీహెచ్ అరవిందబాబులకు ఎన్టీఆర్ ప్రతిభ పురస్కారాలను అతిథుల చేతులమీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పంచుమర్తి కల్పన, మేకల రవీంద్రబాబు, గుమ్మడి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి వ్యాఖ్యాతగా ప్రాసమణి కుమార్ వ్యవహరించారు.

ముగ్గురు అధికారులకు నోటీసులు

విచారణ అధికారిగా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ నియామకం

గుంటూరు(కార్పొరేషన్), జూలై 13: నగరపాలక సంస్థకు చెందిన ట్రావెలింగ్ బంగ్లాలో వైసీపీ ప్రచారసామగ్రి ఉంచటంపై కమిషనర్ కీర్తి చేకూరి స్పందించారు. ఎన్నికల ముందు ప్రభుత్వ కార్యాలయంలో సామగ్రి ఉంచటంపై నివేదిక ఇవ్వాలని విచారణ అధికారిగా డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్‌ను ఆమె ఆదేశించారు. ట్రావెలింగ్ బంగ్లాలో వైసీపీ ప్రచారసామగ్రి ఉంచి విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉన్న బంగ్లా ఇన్‌చార్జి నాగేశ్వరరావు, ఏఈ రాంబాబు, డీఈఈ రమేష్‌బాబులకు షోకాజ్ నోటీసు జారీచేశారు. కార్పొరేషన్‌కు చెందిన కొందరు అధికారులు వైసీపీ ప్రభుత్వానికి కొమ్ముకాస్తూ ప్రచారసామగ్రిని ప్రభుత్వ కార్యాలయంలో నిల్వ ఉంచారు. దీనిపై స్పందించిన కమిషనర్ విచారణకు ఆదేశించారు.

పేరేచర్ల-ఫిరంగిపురం మధ్యన ఎల్‌సీ గేటు తాత్కాలికంగా మూసివేత

గుంటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): పేరేచర్ల-ఫిరంగిపురం రైల్వేస్టేషన్ల మధ్యన ఉన్న లెవల్‌క్రాసింగ్ గేటు నెం.298కి అత్యవసర మరమ్మతుల నిమిత్తం మూసివేశామని డీఆర్ఎం ఎం రామకృష్ణ తెలిపారు. ఈ నెల 14వ తేదీ రాత్రి 8గంటల వరకు ఈ గేటు మూసివేసి ఉంటుందన్నారు. వాహనదారులు, పాదచారులు ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణించాలని విజ్ఞప్తి చేశారు.

పశ్చిమ డెల్టాకు 2519 క్యూసెక్కులు

● బ్యారేజి వద్ద నీటి మట్టం 12 అడుగులు



పశ్చిమ కెనాల్ నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

తాడేపల్లి టౌన్, జూలై 13: ప్రకాశం బ్యారేజి హెడ్ రెగ్యులేటర్ నుంచి కాలువలకు శనివారం అధికారులు నీటిని విడుదల చేశారు. బ్యారేజి ఎగువన వాగుల నుండి 1000 క్యూసెక్కుల వరద నీరు, పట్టిసీమ నుండి 5300 క్యూసెక్కుల నీరు ప్రకాశం బ్యారేజి రిజర్వాయర్‌కు వచ్చి చేరుతోందని నీటిపారుదల శాఖ జేఈ దినేష్ తెలిపారు. ప్రకాశం బ్యారేజి వద్ద 12 అడుగుల నీటిమట్టం నమోదవుతోందని, పశ్చిమ డెల్టాకు 2519 క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్టు దినేష్ తెలిపారు.

సీఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థుల ప్రతిభ

గుంటూరు(విద్య), జూలై 13: ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సీఏ ఇంటర్ ఫలితాల్లో శ్రీమేధ విద్యార్థులు అత్యధిక మార్కులతో ఉత్తీర్ణత సాధించారని ఛైర్మన్ అన్నా నందకిషోర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ విద్యార్థులు ఏ సాయివెంకటధీరజ్ 435 మార్కులు, ఎన్.శృతిహర్షత 360, కె.బాలచందర్ 332, జె.ప్రియకుమారి 326, డి.లక్ష్మీనరసింహా 322, కె.దుర్గా 315 మార్కులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ఛైర్మన్ అన్నా నందకిషోర్, డైరెక్టర్ లక్ష్మీ తదితరులు అభినందించారు.



విద్యార్థులతో అన్నా నందకిషోర్ తదితరులు

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	119, 127, 137
చికెన్ విత్ స్కిన్	226.00
చికెన్ స్కిన్ లెస్	236.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ


అరండల్ పేట ఒకటో లైన్ మొదట అడ్డరోడ్డులో వర్షపు నీరు


ఏటి అగ్రహారం మెయిన్ రోడ్డులో వర్షపు నీరు


చుట్టుగుంట వద్ద ఎక్స్‌కవేటర్‌తో కాలువల్లో అడ్డంకులు తొలగిస్తున్న సిబ్బంది

భారీ వర్షం.. నగరం అతలాకుతలం

- చెరువులను తలపించిన రోడ్లు, కాలువలు
- నీట మునిగిన వెన్ లాక్ మార్కెట్
- పలు అపార్టుమెంట్లలోకి చేరిన వర్షపు నీరు
- వర్షం ప్రభావంతో జనజీవనం అస్తవ్యస్తం


వెన్ లాక్ మార్కెట్ సెల్లారులో నీట మునిగిన వాహనాలు తీసుకొస్తున్న చిత్రం

గుంటూరు(కార్పొరేషన్), జూలై 13 : గుంటూరు నగరంలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి మొదలైన వర్షం శనివారం మధ్యాహ్నం వరకు కురుస్తూనే ఉంది. దీంతో నగరం జలమయంగా మారింది. నగరంలోని అనేక లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిపోయింది. రెండున్నర గంటలపాటు కుంభ వర్షం కురవడంతో నగరంలోని అన్ని ప్రధాన రహదారులు, పల్లపు ప్రాంతాలు చెరువులుగా మారాయి. నగరంలోని మున్సిపల్ ఆఫీస్ వెనుక ఉన్న వెన్ లాక్ మార్కెట్, కుందుల రోడ్డులోని వైట్ హౌస్ అపార్టుమెంట్‌లోని కింద సెల్లార్లకు పూర్తిగా వర్షపు నీరు చేరింది. దీంతో వెన్‌లాక్ మార్కెట్లో 100కు పైగా ద్విచక్ర వాహనాలు, తోపుడు బండ్లు నీట మునిగాయి. కాకాని రోడ్డులోని పందుల కాలనీ, అంబేద్కర్ నగర్, రాజగోపాల్‌నగర్, రాహుల్‌గాంధీ నగర్, జియావుద్దీన్ నగర్, ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని ఆలీ నగర్, లక్ష్మీ నగర్, పాత గుంటూరు బాలాజీ నగర్, శుద్ధపల్లి డొంక, ఎల్బీనగర్, కిడాంబినగర్, కమ్మ శేషయ్య గ్రౌండ్, సూర్యదేవర వేస్టేట్స్, ఏటుకూరు రోడ్డు, రెడ్డిపాలెం సమీపంలోని అనేక కాలనీలు, ఇన్నర్ రింగ్ రోడ్డు ఫేస్ 1, 2లో అనేక కాలనీలు, ఎస్‌వీఎన్ కాలనీ ఎక్స్‌టెన్షన్ ఏరియా, నగరంలోని అనేక ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. రోజంతా చిరుజల్లులు పడటంతో పాదచార్లు, వాహదారులు, చిరు వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నగరంలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు వర్షపు నీరు పారుదల కాక ఇబ్బందులు పడ్డారు. శివారు ప్రాంతాల్లో, విలీన గ్రామాల్లో రోడ్లన్నీ బురదమయంగా మారాయి.

చెరువు కాదు...బీఆర్ స్టేడియమే....

గుంటూరు(తూర్పు), జూలై 13 : మనం చూస్తున్నది చెరువు అనుకున్నారేమో... కాదండి... మన బీఆర్ స్టేడియమే. కాకపోతే శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి ఇలా తయారైంది. మామూలుగానే బీఆర్ స్టేడియం పరిస్థితి అంతంత మాత్రంగా ఉంటుంది. దీనికి తోడు ఈ ఏడాది జనవరిలో క్రికెట్ స్టేడియంగా మారుస్తున్నట్టు వైసీపీ నాయకులు, కొంతమంది ఉన్నతాధికారులు హడావుడి చేశారు. కొద్దోగొప్పో నిధులను కేటాయించి పనులను ప్రారంభించి, స్టేడియంను ఇష్టానుసారంగా తవ్వేశారు. ఇచ్చిన నిధులు ఖాళీ అవ్వడంతో పనులు మధ్యలోనే నిలిపివేశారు. సదరు కాంట్రాక్టరుకు బిల్లులు ఆగిపోవడంతో పనులు ఆపేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు మరమ్మతుల పేరుతో డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా చెడగొట్టేశారు. దీంతో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి తటాకాన్ని తలపించేలా బీఆర్ స్టేడియం తయారైంది. చివరికి స్టేడియంకు వెళ్లే మార్గం కూడా చిత్తడిగా మారింది.


చెరువును తలపిస్తున్న బీఆర్ స్టేడియం


దేవాపురం వద్ద పీకలవాగుని పరిశీలిస్తున్న పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి

అధికారుల పనితీరు వల్లే ముంపు

- పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి
- వరద ముంపునకు గురైన దేవాపురంలో పర్యటన

గుంటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేగా తాను బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి డ్రైనేజీ, రోడ్ల మీద దృష్టి పెట్టాలని పదేపదే చెప్పినా అధికారులు పెడచెవిన పెట్టడం వల్లే ముంపు ఏర్పడిందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల వలన ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లో శనివారం ఆమె పర్యటించారు. తొలుత దేవాపురం 5వ లైన్‌లోని పీకలవాగు గోడకు ఆనుకొని ఉన్న 2 బడ్డీకొట్లు వర్షం ధాటికి వాగులో పడిపోయి, నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిపోయాయని, వాగు మీద చెప్టా కూడా ప్రమాదకరంగా తయారైందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దేవాపురం 4వ లైన్‌లో భారీగా చెత్త కొట్టుకొని వచ్చి, చప్టాల కింద నిలిచిపోవటం వలన ఆ మురుగు నీరు మొత్తం రోడ్ల మీద ప్రవహిస్తున్నదని ఆమెకు తెలిపారు. ఎమ్మెల్యే మాధవి అధికారులతో మాట్లాడుతూ వర్షాకాలంలో చాలా అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులను ఆదేశించారు. పీకలవాగు వలన ప్రజలు ఇబ్బందులు పడే ప్రాంతాల్లో సైడు గోడలు, రోడ్ల నిర్మాణాలకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. కార్యక్రమంలో పోపూరి నరేంద్ర, చింతకాయల శివ, వెంకటేష్ యాదవ్, అలివేలమ్మ, వినోద్, వెంకటేశ్వర్లు, గోపి, చంద్రశేఖర్, ప్రశాంత్, దేగల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇస్కాన్ సంస్థ ఆధ్యాత్మికసేవలు భేష్

మంగళగిరిలోని కొలను కొండలో హరేకృష్ణ గోకులంలో వేంకటేశ్వర స్వామి ఆలయ అనంత శేషస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి గళ్లా మాధవి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గళ్లా మాధవి మాట్లాడుతూ ఇస్కాన్ సంస్థ దేశంలో ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన కలిగే విధంగా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అన్న క్యాంటిన్‌లలో ఇస్కాన్ సంస్థ సహకారం ఎంతో ఉందని, నేడు కలియుగ ప్రత్యక్ష దైవం వేంటేశ్వరస్వామి గుడి నిర్మాణానికి పూనుకోవటం ఎంతో హర్షదాయకమని తెలిపారు.

ఎల్ఐసీ ప్రైవేటీకరణ తగదు

గుంటూరు(తూర్పు), జూలై 13 : దేశానికి ఆర్థిక దన్నుగా నిలుస్తున్న ఎల్ఐసీని ప్రైవేటీకరించవద్దని ఎల్ఐసీ ఏజెంట్స్ ఆర్గనైజేషన్ సంఘం మచిలీపట్నం డివిజన్ అధ్యక్షుడు ఎడ్లపల్లి గాంధీ రామ్మోహన్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక పాత గుంటూరు సీఐటీయూ కార్యాలయంలో శనివారం ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్గనైజేషన్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఎల్ఐసీ ఏజెంట్లకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని అన్నారు. కేరళ తరహా ఏపీలో కూడా వెల్ఫేర్ నిధి ఏర్పాటు చేసి పెన్షన్ సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ఐసీ సంఘం నాయకులు పీఎల్ నరసింహారావు, జి.కిషోర్‌కుమార్, వీవీకే సురేష్, కే.ఉదయలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉండాలి

- తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్

గుంటూరు, జూలై 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు బంగారు భవిష్యత్తు ఉండాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అన్నారు. పొన్నూరు రోడ్డులోని అంజుమన్ ఇస్లామిక్ స్కూల్లో ఆయన ఏర్పాటు చేసిన పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు టీడీ జనార్దన్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ తను ఎమ్మెల్యేగా గెలిచినందుకు తనను అభినందించటానికి వచ్చిన వారిని బొకేలు, శాలువాలు వద్దని నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు మాత్రమే తేవాలని ప్రజలకు, నాయకులకు, కార్యకర్తలకు పిలుపునిచ్చానన్నారు. ప్రజలు నాయకులు కార్యకర్తలు ఇప్పటివరకు 25వేల నోట్ పుస్తకాలు, 30 వేల పెన్నులు, 5000 పెన్సిళ్లు వచ్చాయని, వాటిని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు అందిస్తున్నామన్నారు. టీడీ జనార్దన్ మాట్లాడుతూ మంచి ఆలోచన చేసిన ఎమ్మెల్యే నసీర్‌ను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షాహినా, జమీర్, సలీం, కరీముల్లా, చిన్న బుజ్జి, సమీర్, ఆంజనేయ ప్రసాద్, సురే శీను, హాఫిజ్, కొనకల సత్యం, ఉస్మాన్, బద్రి, బలరాం తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్


అంబేద్కర్ భవన నిర్మాణ పనులను ప్రారంభించాలి

గుంటూరు(తూర్పు), జూలై 13 : స్థానిక ఏసీ కళాశాల ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్ నిర్మాణ పనులను ప్రారంభించా లని కోరుతూ శనివారం తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహమద్‌కు పలు ప్రజా సంఘాల నాయకులు వినతి పత్రం అందజేశారు. కోడిగుడ్డు సత్రం 90 శాతం పూర్తైందని, మిగిలిన పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. క్రిస్టియన్ స్మశాన వాటిక స్థలంలో ఉన్న ఇబ్బందులను తొలగించాలని కోరారు. కోడిగుడ్డు సత్రం పనులను వెంటనే పూర్తి చేసి ఎస్సీ, ఎస్టీ బీసీ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువస్తానని ఎమ్మెల్యే నసీర్ హామీ ఇచ్చారు. మిగిలిన సమస్యల పరిష్కారానికై కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో ప్రజా సంఘాల నాయకులు పాగళ్ళ ప్రకాష్, నల్లం నీలంబరం, సాంబశివరావు, డెన్నిస్ రాయ్, కోటేశ్వరరావు, చిన్నం డేవిడ్ విలియమ్స్, ఏసుబాబు, సమాత, శ్రీనివాస్, మున్ని, దేవరాజ్, బత్తుల అనిల్ తదితరులు ఉన్నారు.

15న జగన్నాథ రథయాత్ర మహోత్సవం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఇస్కాన్ ప్రతినిధులు

గుంటూరు(తూర్పు), జూలై 13 : గుంటూరు నగరంలో ఈనెల 15న జగన్నాథుని రథయాత్ర జరుపుతున్నట్టు ఇస్కాన్ ప్రతినిధి దయానిధి ప్రభు తెలిపారు. స్థానిక ఏటీ అగ్రహారం, రాధాకృష్ణ చంద్ర మందిరంలో శనివారం రథయాత్ర పోస్టర్లను ఇస్కాన్ ప్రతినిధులు ఆవిష్కరించారు. అనంతరం రథయాత్ర మహోత్సవ వివరాలను ఆయన వెల్లడించారు. రథయాత్ర మధ్యాహ్నం 1 గంటకు హిందూ కాలేజీ మార్కెట్ సెంటర్ నుంచి ప్రారంభమై చందన బ్రదర్స్, జగన్నాథ ఆలయం, ఆంజనేయస్వామి ఆలయం, ఏసీ కళాశాల, బ్రాడీపేట ప్రధానదారి మీదగా లక్ష్మీపురం మెయిన్ రోడ్డు, బృందావన్ గార్డెన్స్, పట్టాభిపురం, ఏటీ అగ్రహారం, మల్లారెడ్డినగర్‌లోని ఇస్కాన్ మందిరం వరకు జరుగుతుందని వివరించారు. అనంతరం రాత్రి అన్నదాన ప్రసాద వితరణ జరుగుతుందని అన్నారు. యాత్రలో ఇస్కాన్ బృందంచే సంకీర్తనలు, భజనలు, నాట్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. రథయాత్రలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.




విదుషి భారతి రామసుబ్బన్‌కు అవార్డును ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

రామసుబ్బన్‌కు డాక్టర్ వరదరాజ మెమోరియల్ అవార్డు

గుంటూరు(తూర్పు), జూలై 13: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ప్రధాన కార్యదర్శి యం వై శేషురాణి, అధ్యక్షులు డాక్టర్ పీ విజయ ఆధ్వర్యంలో గాన కళానిధి వింజమూరి వరదరాజ అయ్యంగార్ 109వ జయంతి ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు ముఖ్య అతిథిగా జడ్పీ మాజీ ఛైర్మన్ పాతూరి నాగభూషణం, ఆత్మీయ అతిథిగా డాక్టర్ కారుమూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత కార్యక్రమాలను వింజమూరి సంధ్య, చెన్నై, ఆలయ పాలకమండలి అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. విదుషి భారతి రామసుబ్బన్‌కు డాక్టర్ వింజమూరి వరదరాజ అయ్యంగార్ మెమోరియల్ అవార్డును అతిథులు, సంస్థ వారు ఘనంగా సత్కరించి అందించారు. అనంతరం భారతి రామసుబ్బన్, చెన్నై వారి శాస్త్రీయ సంగిత కచేరి జరిగింది. మండలి ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం మీనాక్షి, పి.లలిత దేవి, కార్యదర్శి ఎ.మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణల ఆధ్వర్యంలో కళాకారులను అతిథులను ఘనంగా సత్కరించారు.

ఎక్సైజ్, ఎస్ఈబీ శాఖలను కలిపి ఎక్సైజ్ శాఖగానే ఉంచాలి

- మాజీ మంత్రులు కన్నా, ఆనందబాబులకు వినతి

గుంటూరు(కార్పొరేషన్), జూలై 13 : ఎక్సైజ్ , ఎస్ఈబీ శాఖలను కలిపి ఎక్సైజ్ శాఖగా ఉంచాలని గుంటూరు జిల్లా ఎస్ఈబీ అధికారులు, సిబ్బంది కోరారు. శనివారం మాజీ మంత్రులైన, ప్రస్తుత శాసనసభ్యులైన కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనందబాబులను కలిసి 2019 ముందు ఎలాగైతే ఎక్సైజ్‌గా ఉందో అలాగే ఉంచాలని వినతిపత్రం అందజేశారు. అధికారులు మాట్లాడుతూ శాఖలలో గత నాలుగు సంవత్సరాలుగా నెలకొని వున్న సమస్యలను వివరించి వారికి వినతిపత్రం అందజేశామన్నారు. ఇద్దరు ఎమ్మెల్యేలు సానుకూలంగా స్పందిస్తూ... ఎస్ఈబీ ఉద్యోగుల సమస్యల పరిష్కార దిశగా ఎక్సైజ్ మంత్రితో, ప్రభుత్వంతో చర్చిస్తామని, ఎక్సైజ్ సిబ్బందిని వారి సొంత శాఖకు పంపించేందుకు కృషి చేస్తామన్నారు. 2019 సంవత్సరానికి ముందు ఉన్న ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖను పునరుద్ధరించేలా కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఈబి డిప్యూటీ కమిషనర్(హెడ్ క్వార్టర్) డాక్టర్ కే.శ్రీనివాసులు, గుంటూరు ఈఎస్ రంగారెడ్డి, సీఐలు పి.విజయ్ కుమార్, లత, ప్రసన్నలక్ష్మీ, ఎస్సైలు తులసి, రెహమాన్, రాజేంద్ర, హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ లక్ష్మానాయక్, వెంకటేశ్వర్లు, చెన్నారెడ్డి, పూర్ణ, ఆంజనేయులు, దిలీప్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.


కన్నా లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేస్తున్న ఎస్ఈబీ అధికారులు

మైనార్టీ శాఖపై శ్వేత పత్రం విడుదల చేయాలి : షరీఫ్

గుంటూరు, జూలై 13 : ముఖ్యమంత్రి చంద్రబాబు శాఖల వారీగా వరుస సమీక్ష సమావేశాలు నిర్వహిస్తూ శ్వేతపత్రాలు విడుదల చేస్తూ ప్రజల విశ్వాసం చూరగొంటున్న తరుణంలో మైనార్టీ శాఖపై కూడా శ్వేత పత్రం విడుదల చేయాలని ముఖ్యమంత్రిని మైనార్టీ ఆశయ సాధన సమితి అధ్యక్షుడు ఎస్ఎం షరీఫ్ కోరారు. స్థానిక సమితి కార్యాలయంలో శనివారం జరిగిన సమావేశంలో షరీఫ్ మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ వక్ఫ్ బోర్డ్, మైనార్టీ ఆర్థిక సంస్థ, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్, హజ్ కమిటీ, సిఈడిఎం, మైనార్టీ కమిషన్ ఆయా విభాగాలకు సంబంధించి మైనార్టీ శాఖలపై కూడా సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదలకై ముస్లిం మైనార్టీలు కాంక్షిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సమితి ప్రతినిధులు జానీబాషా, ఆసిఫ్, రెహ్మాన్, ఆరిఫ్‌పాల్గొన్నారు.


ముంబైలో శనివారం రాత్రి జరిగిన దిగ్గజ పారిశ్రామికవేత్త ముకేష్ అంబాని తనయుడు అనంత్ అంబాని వివాహ వేడుకకు సీఎం చంద్రబాబుతో కలిసి కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సతీసమేతంగా హాజరయ్యారు. - గుంటూరు.

అన్న క్యాంటీన్ల పునః ప్రారంభానికి చర్యలు

- పనులు పూర్తి చేయాలని కమిషనర్ ఆదేశాలు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 13 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి పేదవానికి నాణ్యమైన అల్పాహారం, భోజనం ను నామ మాత్రపు ధరకే అందించేందుకు సంకల్పించిన అన్న క్యాంటీన్లను నగరంలో ప్రారంభించేందుకు శరవేగంగా ఏర్పాట్లను చేపట్టారు. వచ్చేనెల మొదటి వారానికి పూర్తి స్థాయిలో సిద్ధం చేయాలని నగర కమిషనర్ కీర్తి చేకూరి శనివారం ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అన్న క్యాంటీన్లలో జరుగుతున్న మరమ్మతు పనులపై ఇంజినీరింగ్ అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా కమిషనర్ తగు ఆదేశాలు జారీ చేశారు.

కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అన్న క్యాంటీన్లను ప్రతిష్టాత్మకంగా పునఃప్రారంభం చేయనున్నదని, నగరపాలక సంస్థ పరిధిలోని 8 అన్న క్యాంటీన్లను ఆగస్టు మొదటి వారానికి వినియోగంలోకి తీసుకురావడానికి ఇప్పటికే రూ.74 లక్షలతో టెండర్ ప్రక్రియ పూర్తయిందన్నారు. టెండర్ పొందిన కాంట్రాక్టర్లు నిబంధనలకు అనుగుణంగా, నాణ్యతా ప్రమాణాల్లో రాజీ లేకుండా నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలన్నారు. క్యాంటీన్లు ఉన్న ప్రాంతాల ఏఈలు పనులను వేగంగా జరిగేలా బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. పనుల పురోగతిపై డీఈఈలు, ఈఈలు ఎప్పటికప్పుడు నివేదిక ఇవ్వాలన్నారు.


అన్న క్యాంటీన్‌లో పనులు జరుగుతున్న చిత్రం

జీపీఎస్ ఉత్తర్వులను తక్షణమే ఉపసంహరించుకోవాలి

గుంటూరు(విద్య), జూలై 13 : పాత పెన్షన్ కోసం ఎదురుచూస్తున్న లక్షలాది ఉద్యోగుల ఆశల్ని కాలరాస్తూ పాత తేదీతో ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబరు 44ను తక్షణమే ఉపసంహరించుకోవాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.కళాధర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన జీవో పట్ల నిరసన వ్యక్తం చేస్తు జీవో ప్రతుల్ని దహనం చేశారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ ఛైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులందరికి తక్షణమే పాత పెన్షన్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ ఆదినారాయణ మాట్లాడుతూ పాత పెన్షన్ విధానం తప్ప ఇతర పెన్షన్ విధానాల్ని అంగీకరించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా సహాధ్యక్షురాలు శివ పార్వతి, జిల్లా కార్యదర్శులు వెంకటేశ్వరరావు, గోవిందు, కోటిరెడ్డి, ప్రేమ్ కుమార్, జిల్లా కమిటీ సభ్యులు రంగారావు, వినోద్, గోపయ్య, బాజీ బాబా తదితరులు పాల్గొన్నారు

జీపీఎస్ జీవోల్ని వెంటనే రద్దుచేయాలి : ఏపీటీఎఫ్

గత జగన్ ప్రభుత్వం కాంట్రిబ్యూటరీ పెన్షన్ పథకం (సీపీఎస్) స్థానంలో తీసుకొచ్చిన గ్యారంటీ పెన్షన్ పథకం (జీపీఎస్) వెంటనే రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మేకల సుబ్బారావు డిమాండ్ చేశారు. దీనికి సంబంధించిన ఫైలుపై గత నెల 12న అప్పటి ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్ సంతకం చేశారని దానిని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. జీపీఎస్ పెన్షన్‌పై జూన్ 12న జీవో 54ను విడుదల చేయగా పాత ప్రభుత్వంలోనే రూపొందించిన నోటిఫికేషన్‌ను తాజాగా శుక్రవారం గెజిట్లో అప్‌లోడ్ చేశారు. జీపీఎస్ పథకం గత ఏడాది అక్టోబరు 20 నుంచి అమల్లోకి వస్తుందని దానిలో పేర్కొన్నారు. ఇప్పుడు నోటిఫికేషన్ ఇచ్చి గత ఏడాది అక్టోబరు నుంచి అమల్లోకి వస్తుందనడం దుర్మార్గమైన చర్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులకు నష్టం కలిగిస్తుందని పేర్కొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి పీవీ రమేష్

కుల నిర్మూలనతోనే సమ సమాజం

- విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీ రమేష్

గుంటూరు, జూలై 13 : భారతదేశంలో కుల నిర్మూలనతోనే సమ సమాజం సాధ్యమని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్-జాషువా-పూలే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ అధ్యక్షతన బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో శనివారం కుల నిర్మూలన ప్రతుల ఆవిష్కరణ సభ జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పోరాటాలు ఒకే ఒరవడిలో జరగాలని విశ్లేషించారు. అంబేద్కర్ జీవించిన కాలంలో మతాలు చాలా తక్కువని ప్రధానంగా కులాలే సమాజంగా ఉందని వివరించారు. 19వ శతాబ్ది నుంచి కుల వ్యవస్థలో మార్పులు జరగడం ఎక్కువైంద న్నారు. కుల నిర్మూలన జరిగి తీరుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, వీసీకే పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కె.జయసుధ, కొరివి వినయ్‌కుమార్, పాటిబండ్ల కోటేశ్వరరావు, మేడిద బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

16న గవర్నర్ భవన్ వద్ద శాంతియుత నిరసన

గుంటూరు(తూర్పు), జూలై 13 : రాష్ట్ర వ్యాప్తంగా ఆగని అత్యాచారాలు హత్యల నేపథ్యంలో ఈ నెల 16వ తేదీన గవర్నర్ భవన్ వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్) శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బ్లూ ఫిలింలు రాష్ట్రంలో ఓపెన్ అవ్వకుండా బ్లాక్ చేసే విధానం అత్యంత కీలకమని ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కొన్నింటిని నియంత్రించకుంటే ప్రభుత్వం అత్యాచారాలు హత్యల విషయంలో నిరంతరమైన సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని సూచించారు. శాంతియుత నిరసనలో శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

అతను పింఛన్ పొందుతున్నాడు : కమిషనర్

గుంటూరు, జూలై 13: స్టావ్ పేలి తీవ్రగాయాలతో కోలుకొని ఇబ్బందులుపడుతోన్న రాజవరపు వెంకట రమణరావు పింఛన్ పొందుడుతున్నాడని, ఈ మేరకు విచారణలో తేలినట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఒక ప్రకటనలో తెలిపారు. తనకు సదరంలో తెనాలిలో వైద్యులు 47 శాతం మాత్రమే ధ్రువీకరణపత్రం ఇచ్చారని, తద్వారా పింఛన్ పొంద టం లేదంటూ చెప్పటం అవాస్తవ మని, అతను 101 సచివాలయం పరి ధిలో ఉన్నాడని, నెలనెలా పింఛన్ కూడా పొందుతున్నాడని స్పష్టం చేశారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

గుంటూరు, జూలై 13 : స్థానిక లాలాపేట స్టేషన్ పరిధిలోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం మొదట గేటు వద్ద మురుగు కాలువ పక్కన గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సుమారు 45 నుంచి 50 సంవత్సరాల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది ఉన్నాడు.. మృతదేహంను రుద్ర ట్రస్ట్ వారి సహకారంతో జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని ఆచూకీ తెలిసినవారు లాలాపేట పోలీస్ స్టేషన్‌లో తెలియజేయాలని పోలీసులు కోరారు.


గుర్తు తెలియని మృతదేహం

బహిరంగ ప్రకటన

ఇందు మూలముగా యావన్మందికి పత్రికా ప్రకటన ద్వారా తెలియ చేయడమేమనగా నా క్లయింటు అయిన **అంబటి గోపాలరావు** తండ్రి **వెంకటరావు,** డోరు నెం. 1-36-260, 2వ లైను, సత్యన్నారాయణ పురం, మారుతి నగర్, గుంటూరు ఆంధ్రప్రదేశ్ కాపురస్తులు గారి ఆస్తికి సంబంధించిన లోవైనపు లింకు దస్తావేజులు నెం. **1561/1991**కు నా క్లయింటు ది. **08-07-2024**న ఉదయం 10:00 సమయములో మారుతి నగర్ నుండి కొరిటెపాడు సబ్‌రిజిస్ట్రారు ఆఫీసుకు పోవు దారిలో ఒరిజినల్ లింకు దస్తావేజులు పోయియున్నవి. అందు విషయమై చుట్టుప్రక్కల వెతికి విచారించినా అవి కనిపించలేదు. సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికినా యెడల అట్టి వారు నా క్లయింటుకు తెచ్చి ఇవ్వగలరు. తెచ్చి ఇచ్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

బురదగుంట రాజారావు, M.A.Lit(E), L.L.B.
నూతలపాటి సుబ్బారావు, B.A., L.L.B., B.Ed.
అడ్వకేట్స్, మారుతినగర్, గుంటూరు.
సెల్ : 77806 68606, 96662 59766

బహిరంగ ప్రకటన

మా క్లయింటు గుంటూరు జిల్లా, పాత మంగళగిరి, శీతారామ కోవెల నివాసి లేటు మర్రి మస్తాన్ కుమారుడు అయిన మర్రి వెంకటేశ్వరరావు గారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా.

షెడ్యూలు దాఖలా ఆస్తి మా క్లయింటు మరియు వారి తమ్ముడు జాయింటు ఆస్తియై యున్నది. మా క్లయింటు ప్రస్తుతం హైదరాబాదులో నివాసం ఉన్నందున ఇదే అవకాశంగా భావించి సదరు మా క్లయింటు తమ్ముడు మర్రి వెంకట క్రిష్ణారావు మా క్లయింటు ప్రమేయం లేకుండా ఆస్తిని అమ్మకము చేయుటకు మరియు కొందరు కొనుటకు ప్రయత్నము చేస్తున్నట్లు తెలిసినది. సదరు షెడ్యూలు ఆస్తిని ఎవరైనా కొనుగోలు చేసిన వారికి ఎటువంటి హక్కులు రావు కావున ఎవరైనా కొనదలిస్తే మా క్లయింటుని మాత్రమే సంప్రదించవలెను. ఎవరైనా అమ్ముటకుగానీ కొనుటకుగానీ ప్రయత్నం చేసినయెడల వారిపై మా క్లయింటు కఠినమైన క్రిమినల్ మరియు సివిల్ చర్యలు తీసుకొనబడును.

షెడ్యూలు :

సర్వే నంబరు 99, డోర్ నెం.11-103, 170 Sq.yards. **తూర్పు:** బ్రాహ్మణ సత్రం, **దక్షిణం:** బజారు, **పడమర:** నక్కా దివెంకటేశ్వర్లు గారి ఇల్లు, **ఉత్తరం :** నా తాలూకు ప్రహరీ గోడ.

ఇట్లు : **K.V.అరవిందకుమార్ నాయుడు**
నోటరీ & అడ్వకేట్, కందుకూరు,
S.P.S.R.నెల్లూరు జిల్లా, సెల్: **9440219624**

GENERAL NOTICE


IN THE COURT OF THE I ADDL. CIVIL JUDGE(SENIOR DIVISION): GUNTUR
I.P No: 29 / 2024

BETWEEN :
Muppalla Sridhar. ...Petitioner
And
1)Gorantla Srinivasa Rao,2)Muppalla Anil Kumar,3)Veluvolu Siva Rama Krishna, 4)GorantlaLakshmi Narayana, 5) Ponakala Indira Devi, 6)GorantlaSrinivasa Rao,7)Ainampudi Nageswara Rao,8)Kolla Hemanth Kumar,9)Dandamudi Raghu Nadha Rao,10)Kolla Srinivasa Rao, 11) Kata Rattaiah, 12) Parchuri Dhana Lakshmi, 13)Daniyala Venkata Ratnam, 14) Talasila Srikanth, 15)The Official Receiver, Guntur. ...Respondents.

పై నెంబరు IP లోని పిటీషనర్ తనను ఇన్‌సాల్వెంటుగా డిక్లేర్‌చేయుమని కోరుచు పిటీషన్ దాఖలు చేయుగా సదరు పిటీషన్‌పై ఎవరికైన అభ్యంతరములు ఉంటే తెలుపుకోనవలసినదిగా శ్రీ కోర్టు వారు జనరల్‌నోటీసు నిమిత్తం ది:06-08-2024కి వాయిదావేసినారు. కావున ఆరోజున ఉ॥గం॥ 10:30ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ తరపు వకీలు గారి ద్వారా గాని హాజరై మీకు గల అక్షేపణలు తెలుపుకొనగలరు. లేనిచో శ్రీ కోర్టు వారిచే మీ పరోక్షమున తీర్మానించబడును.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులు ప్రకారం)
వాయిదా తేది.06-08-2024.

K.V.RAGHU NATH
Advocate for Petitioner,Guntur.

అమరావతిలో చంద్రబాబు బయోపిక్ ప్రారంభం



ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బయోపిక్ 'ధర్మ చక్ర' షూటింగ్‌ను తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్ క్లాప్ కొట్టి శనివారం ప్రారంభించారు. రాజధాని గ్రామం మల్కాపురం వి స్క్వేర్ ఆడిటోరియంలో ఈ కార్యక్రమం జరిగింది. పసుపులేటి వెంకట రమణ దర్శకత్వంలో మనోహర్ నాయుడు నిర్మిస్తున్నారు. పది రోజుల పాటు అమరావతిలో షూటింగ్ జరుగుతుంది. ఇందులో రాజధాని కోసం భూములిచ్చిన రైతులు కూడా కళాకారులతో నటిస్తారు.

- తుళ్లూరు(ఆంధ్రజ్యోతి)

రూ. వెయ్యి కోట్ల క్లబ్‌లో కల్కి



ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ దర్శకత్వం వహించిన 'కల్కి 2898 ఏడీ' చిత్రం బాక్సాఫీస్ వద్ద దుమ్మురేపే వసూళ్లతో దూసుకుపోతోంది. తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా హిందీ బెల్ట్‌లో, విదేశాల్లోనూ సంచలన వసూళ్లను సాధిస్తోంది. తాజాగా 'కల్కి' చిత్రం కీర్తి కిరీటంలో మరో మైలురాయి చేరింది. ఈ చిత్రం రూ. వెయ్యి కోట్ల వసూళ్లను అందుకున్నట్లు నిర్మాణ సంస్థ వైజయంతీ మూవీస్ శనివారం తెలిపింది. విడుదలైన మూడు వారాల తర్వాత కూడా బాక్సాఫీసు దగ్గర నిలకడైన వసూళ్లతో కొనసాగుతున్నట్లు తెలిపింది. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకొనే, దిశాపటానీ కీలకపాత్రలు పోషించారు. సి. అశ్వనీదత్ నిర్మించారు.

మోసపోయా.. ఆత్మహత్య చేసుకుంటా



నటుడు రాజ్ తరుణ్, అతని ప్రియురాలు లావణ్య వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. రాజ్ తరుణ్ 11 ఏళ్ల తనతో సహజీవనం చేసి.. ఇప్పుడు మాల్వీ మల్హోత్రా అనే హీరోయిన్‌తో తిరుగుతూ తనను దూరం పెడుతున్నాడంటూ కేసు పెట్టిన లావణ్య.. శుక్రవారం రాత్రి ఆత్మహత్యా యత్నానికి పాల్పడినట్టు తెలిసింది. ఆత్మహత్య చేసుకుంటున్నానంటూ తన న్యాయవాదికి వాట్సాప్ చాటింగ్‌లో చెప్పడం.. ఆయన 112కు ఫోన్ చేయడంతో నార్సింగ్ పోలీసులు వెంటనే ఆమె ఇంటికి చేరుకుని కౌన్సిలింగ్ ఇచ్చారు. తనకు రూ.5 కోట్లు ఇస్తామని, కేసు వెనక్కి తీసుకోవాలని కొందరు బెదిరిస్తున్నారని న్యాయవాదితో చాటింగ్‌లో ఆమె పేర్కొన్నారు. రాజ్ తరుణ్ చేతిలో దారుణంగా మోసపోయాయని, ప్రతిదీ ఓ పథకం ప్రకారం జరిగిందన్నారు. అందుకే ఆత్మహత్య చేసుకోవాలనుకున్నానని, తన చావుకు రాజ్ తరుణ్, అతని తల్లిదండ్రులతో పాటు మాల్వీ మల్హోత్రా కారణమని పేర్కొన్నారు. లావణ్య శనివారం తన న్యాయవాదితో కలిసి నార్సింగ్ పోలీసుల ఎదుట విచారణకు హాజరై రాజ్ తరుణ్‌తో తనకు ఉన్న సంబంధంపై పలు విషయాలు వెల్లడించినట్లు తెలిసింది. నార్సింగ్ పోలీసులు పలు సెక్షన్ల కింద మాల్య, మయాంక్, రాజ్ తరుణ్‌పై కేసు నమోదు చేశారు.

హైదరాబాద్ సిటీ/నార్సింగ్ (ఆంధ్రజ్యోతి)

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



మంత్రి మనోహర్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

17న ఏపీ హోటల్స్ అసోసియేషన్ ఈసీ..

● ముఖ్య అతిథిగా మంత్రి నాదెండ్లకు ఆహ్వానం

తెనాలి, మారీసుపేట జూలై 13: ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఈసీ సమావేశాన్ని ఈ నెల 17న నిర్వహిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ హోటల్స్ అసోసియేషన్ రాష్ట్ర ట్రెజరర్ ఈదర వెంకట పూర్ణచంద్ తెలిపారు. పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను ఏపీ హోటల్స్ అసోసియేషన్ సభ్యులు స్టేట్ ట్రెజరర్ ఈదర వెంకట పూర్ణచంద్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలసి అయనను దుశ్శాలువాతో సత్కరించి అభినందలను తెలిపారు. ఈ నెల 17న తాము నిర్వహిస్తున్న ఏపీ హోటల్స్ అసోసియేషన్ స్టేట్ ఈసీ సమావేశానికి మంత్రి మనోహర్‌ను ముఖ్య అతిథిగా పాల్గొనాలని కోరినట్లు వెంకట పూర్ణచంద్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, పట్టణ కమిటీ సభ్యులు యనమదల సాంబ శివరావు, సుబ్రహ్మణ్యం, చంటి, శ్రీకాంత్, సతీష్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో సినీ రంగ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

● మంత్రికి విన్నవించిన మా ఏపీ ప్రతినిధులు



మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న మా ఏపీ ప్రతినిధులు

తెనాలి అర్బన్, జూలై 13 : రాష్ట్రంలో సినిమా రంగం అభివృద్ధి కోసం కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలని మా ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా కోరారు. శనివారం రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌ను కలిసి వినతిపత్రం అందించామని తెలిపారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం సినిమా రంగంపై దృష్టి సారించలేదని రాష్ట్రంలో ఎన్నో అవకాశాలు ఉన్నప్పటికీ నిర్లక్ష్యం చేశారని చెప్పారు. మౌలిక సదుపాయాల కల్పనచేయాలని కోరామని, అమరావతిలో సినిమా స్టూడియో ఏర్పాటు చేయాలని, రాజమండ్రి, విశాఖపట్నం, తిరుపతిలో కూడా స్టూడియోల నిర్మాణానికి ఆసక్తి చూపే వారికి అవకాశాలు ఇవ్వాలని, నిర్మాతలు, దర్శకులు, నటీనటులు, సాంకేతిక నిపుణులకు రాజధానిలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరామన్నారు. ఆంధ్రాలో 1090, తెలంగాణాలో 480 సినిమా థియేటర్లు ఉన్నాయని, థియేటర్లు మూతపడకుండా తగిన సహకారం అందించాలని కోరారు. చిత్ర నిర్మాణానికి రాష్ట్రంలో ఎన్నో లోకేషన్లు అందుబాటులో ఉన్నాయని, పరిశ్రమకు ప్రోత్సాహకాలు ఇచ్చి అభివృద్ధి చెందేలా చూడాలన్నారు. మిలటరీ ప్రసాద్, టీనా చౌదరి, సత్యనారాయణ పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం రూ.20వేలు అందించాలి

● రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకాశివసాంబిరెడ్డి

తెనాలి రూరల్, జూలై 13: గత సంవత్సరం వర్షాలు కారణంగా పంటలు దెబ్బతిని తీవ్రనిరాశతో ఉన్న రైతాంగానికి కూటమి ప్రభుత్వం భరోసా కల్పిస్తూ రూ.20 వేలు పెట్టుబడి సాయం అందించి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకాశివసాంబిరెడ్డి శనివారం ఒక ప్రకటన ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. గత సంవత్సరం మిచౌంగ్ తుఫాన్ తదితర కారణాల వలన నష్టపోయిన రైతులు పెట్టుబడి సాయం కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. అలంకారప్రాయంగా ఉన్న రైతు భరోసా కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకునేలా అన్నివిధాలా సౌకర్యాలు కల్పించాలన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోనెం 22ను రద్దు, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగించే విధానంను రద్దు చేయాలని తెలిపారు. డాక్టర్ ఎం.ఎస్ స్వామి నాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలని, కేరళ ప్రభుత్వం రైతుల కోసం 14 రకాల పంటలకు అమలు చేస్తున్న విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. పెరిగిన సాగు వ్యయానికి తగ్గట్టుగా గిట్టుబాటు ధరలను పెంచి ప్రభుత్వమే రైతుల పండించిన పంటలను కొనుగోలు చేయాలన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్‌ను రద్దుచేసే విధంగా అసెంబ్లీలో చట్టం చేసి తప్పులు లేని పాస్ పుస్తకాలను ఇవ్వాలని, గ్రామ సభల ద్వారా సీసీఆర్‌సీ కార్డులు కౌలు రైతులందరికీ అందేలా చూడాలని శివసాంబిరెడ్డి కోరారు.



ముఖ్యమంత్రి చిత్రపటాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆలపాటి

ముఖ్యమంత్రి చిత్రపటం ఆవిష్కరణ

తెనాలి అర్బన్, జూలై 13 : కాకతీయ సొసైటీలో శనివారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటాన్ని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలపాటి మాట్లాడుతూ, రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి ఎంతో కష్టపడుతున్నారని, ఏడు పదుల వయసులో కూడా విశ్రాంతి తీసుకోకుండా పని చేస్తున్నారన్నారు. ఐదేళ్లలో రాష్ట్రం రాజధానితో పాటు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండేలా ఆయన పని తీరు ఉంటుందన్నారు. 23 ఏళ్లుగా కాకతీయ సొసైటీ అభివృద్ధి చెందుతూ ఎంతో మంది సభ్యులు, ప్రజలకు రుణాలు అందిస్తూ సేవ చేస్తుందన్నారు. కార్యక్రమంలో తాడిబోయిన హరి ప్రసాద్, ఖలీల్, సొసైటీ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదభరితంగా కల్వర్టు

తెనాలిఅర్బన్, జూలై 13: పట్టణంలోని షరాఫ్ బజారులో కల్వర్టు కుంగిపోవడంతో రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం ద్విచక్ర వాహనదారులతో రద్దీగా ఉండే ఈ మార్గంలో కల్వర్టుపై బండలు దెబ్బతిని కుంగిపోయాయి. దానిని గమనించకుండా వెళ్లే వాహన చోదకులు ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. స్థానికులు ప్రయాణికుల రక్షణ కోసం కల్వర్టు వద్ద ఒక తాత్కాలికంగా కర్రపాతి ఒక ఎర్ర గుడ్డ కట్టారు. అధికారులు స్పందించి కల్వర్టును వెంటనే బాగు చేయాలని వ్యాపారులు కోరుతున్నారు.

రహదారులు జలమయం



పొన్నూరు పట్టణంలోని జీబీసీ రోడ్డుపై నిల్చిన వర్షపు నీరు

● పొన్నూరులో 40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు
● నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
● చేబ్రోలులో రామలింగేశ్వర స్వామి ఆలయంలోకి వర్షపు నీరు

పొన్నూరుటౌన్, జూలై 13 : పొన్నూరు పట్టణం, మండలంలో శనివారం 40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వర్షం శనివారం మధ్యాహ్నం వరకు కురుస్తూనే ఉంది. ఏకదాటిగా కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పట్టణ, మండలంలోని పల్లపు రహదారులు అన్ని వర్షపు నీటితో నిండి కాల్వలను తలపించాయి. పట్టణంలోని ప్రధాన రహదారి జీబీసీ రోడ్డు, ఆర్టీసీ బస్టాండ్ సెంటర్, బాపట్ల రోడ్డులోని సెయింట్ ఆన్స్ పాఠశాల వద్ద భారీగా వర్షపు నీరు చేరడంతో ప్రయాణీకులు, పాదచారులు తీవ్ర అవస్థలను ఎదుర్కొన్నారు. అలాగే మండల పరిధిలోని చింతలపూడి వద్ద కూడా జీబీసీ రోడ్డులో వర్షపు నీరు నిలిచింది. మండల పరిధిలోని మాచవరం గ్రామంలో భారీ వర్షానికి రహదారులు కాల్వలను తలపించాయి. వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక అంతర్గత రహదారులోనే నిల్చివుండటంతో వాన నీటిలోనే గ్రామస్థులు రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడింది. మాచవరంతోపాటు, వెల్లలూరు తదితర గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలో వర్షపు నీరు చేరటంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

చేబ్రోలు: గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు చేబ్రోలు మండలంలో లోతట్టు ప్రాంతాలో జలమయం అయ్యాయి. శుక్రవారం నుంచి శనివారం వరకు ఏక దాటిగా కురిసిన వర్షానికి జన జీవనం అస్తవ్యస్తంగా మారింది. మండల పరిధిలోని శెలపాడు గ్రామంలో కురిసిన వర్షానికి పల్లపు ప్రాంతంలో ఉన్న రామలింగేశ్వర స్వామి ఆలయం చుట్టూ వర్షపు నీరు చేరి ఆలయంలోకి భక్తులు రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అలాగే సమీపంలో ఉన్న అంగన్‌వాడీ కేంద్ర చుట్టూ అడుగున్నర మేర వర్షపు నీరు చేరటంతో అంగన్‌వాడీ కేంద్రానికి రావాలంటేనే గ్రామస్థులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. గ్రామంలో పల్లపు ప్రాంతాలో నిల్చిన వర్షపు నీటిని తక్షణమే బయటకు మళ్లించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



రామలింగేశ్వర స్వామి ఆలయం చుట్టూ చేరిన వర్షపు నీరు

విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించండి

● మంత్రి మనోహర్‌కు యూనియన్ సభ్యుల వినతి



మంత్రి మనోహర్‌కు వినతిపత్రం అందిస్తున్న విద్యుత్ మీటర్ రిడర్స్ సభ్యులు

తెనాలి రూరల్, జూలై 13: కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే విద్యుత్ మీటర్ రీడర్లకు కూటమి ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించేలా చూడాలని కోరుతూ పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు యూనియన్ నేతలు వినతిపత్రం అందించారు. శనివారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో మంత్రి నాదెండ్లమనోహర్‌ను తెనాలి విద్యుత్ మీటర్ల రీడర్స్ సభ్యులు కలిసి వారి సమస్యలను వివరించారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మీటర్ రీడర్స్‌ని అనేకరకాలుగా ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ముఖ్యంగా మీటర్ రీడర్స్‌కి 22వ తేదీ వరకూ పనిదినాలు మాత్రమే ఉండేవని వాటిని 11వ తేదీ వరకు తగ్గించడం జరిగిందన్నారు. రీడింగ్ తీసిన ప్రతి బిల్లుకు రూ.3.80పైసలు చెల్లించాల్సి ఉండగా రూ.3 మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. మీటర్ రీడర్స్‌కి పొట్టకొట్టేందుకు స్మార్ట్ మీటర్స్‌ని బిగించాలని వైసీపీకి చెందిన షిర్డీసాయి ఎలక్ట్రికల్స్‌కి కాంట్రాక్ట్ ఇచ్చి ప్రజలపై స్మార్ట్‌మీటర్ల భారం వేయడానికి సిద్ధమయ్యారని ఆ విధానాన్ని నిలుపుదల చేసి రీడర్స్‌గా పనిచేస్తున్న వారందరికీ ఉద్యోగ భద్రత కల్పించి తమను ఆదుకోవాలని కోరుతూ వినతి పత్రం అందించారు. ఎండీ జాఫర్, గౌస్, భాను ప్రకాష్, ఖాజావల్లి నాగరాజు, నాగప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరించాలి

పొన్నూరుటౌన్, జూలై13 : గత వైసీపీ ప్రభుత్వ హయంలో అప్పటి సీఎం జగన్మోహన్ రెడ్డి ఎత్తివేసిన ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నేడు కూటమి ప్రభుత్వం పునరుద్ధరించేందుకు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చొరవ తీసుకోవాలని సెయింట్ మేరీస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ జోసఫ్ మోసిగంటి శనివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రంలో పేదలు పోస్ట్ గ్రాడ్యూవేషన్ చేయకుండా ఉండటం కోసం గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసిందని ఆరోపించారు. జగన్ ముఖ్యమంత్రి కాకముందు విద్యార్థి ఏ కళాశాల్లో చదివినా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇచ్చేవారన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జగన్‌మోహన్‌రెడ్డి ఆ పథకాన్ని పూర్తిగా ఎత్తివేసి ఎంతో మంది పేద విద్యార్థులకు అన్యాయం చేశాడని మండిపడ్డారు. ఒక ప్రభుత్వ యూనివర్సిటీ కళాశాల్లో మాత్రమే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారన్నారు. ఆ కళాశాల్లో సీట్లు తక్కువగా ఉన్నందున, ఎక్కువ మంది ఇతర కళాశాలల్లో చేరుతున్నారని, వారందరికీ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను నిలిపివేశారని అన్నారు. దీంతో పేద విద్యార్థులకు అన్యాయం జరుగుతుందన్నారు. విద్యాశాఖ మంత్రి నార లోకేశ్ దీనిపై దృష్టి సారించి ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను పునరుద్ధరిస్తే ఎంతో మంది పేదలు ఉన్నత విద్యకు చేరువతారన్నారు. ఇప్పటికే కౌన్సిలింగ్ వెబ్ ఆప్షన్స్ ఈ నెల 15వ తేదీతో ముగుస్తునందున దీనిపై ఒక నిర్ణయం తీసుకోవాలని ప్రొఫెసర్ జోసఫ్ మోసిగంటి మంత్రి లోకేశ్‌ను కోరారు.

కుల నిర్మూలనతోనే సమ సమాజం

గుంటూరు, జూలై 13 : భారతదేశంలో కుల నిర్మూలనతోనే సమ సమాజం సాధ్యమని విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ పీవీ రమేష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్-జాషువా-పూలే-పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బీ.విల్సన్ అధ్యక్షతన బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో శనివారం కులనిర్మూలన ప్రతుల ఆవిష్కరణ సభ జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక పోరాటాలు ఒకే ఒరవడిలో జరగాలని విశ్లేషించారు. అంబేడ్కర్ కాలంలో మతాలు చాలా తక్కువని ప్రధానంగా కులాలే సమాజంగా ఉందని వివరించారు. కార్యక్ర మంలో డొక్కా మాణిక్యవరప్రసాద్, జయసుధ, కొరివి వినయ్‌కుమార్ పాల్గొన్నారు.



జంపని డ్రెయిన్ పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ శేషన్న తదితరులు

జంపని డ్రెయిన్‌ను పరిశీలించిన కమిషనర్

తెనాలి, మారీసుపేట జూలై 13: పట్టణంలోని జంపని డ్రెయిన్‌ను మున్సిపల్ కమీషనర్ శేషన్న పరిశీలించారు. స్థానిక రామలింగేశ్వర పేటలోని పూలే కాలనీలో శనివారం జంపని డ్రెయిన్‌ను పురపాలక సంఘ కమిషనర్ అధికారులతో కలసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షపు నీరు పట్టణంలో నిలువకుండా ఉండటానికి ప్రధాన డ్రెయిన్‌లలోని పూడికను తొలగించామన్నారు. వ్యర్థాలను మురుగు కాలువలో వేయండంతో మురుగు నీరు, వర్షపునీరు పారుదల లేక రోడ్లపై నీరు నిలబడి పోతుందని, ప్రజలు చెత్తను, వ్యర్థాలను డ్రెయిన్‌లలో వేయరాదని సూచించారు. మురుగు పారుదల సమస్యలు ఏర్పడితే సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. పట్టణంలో మురుగు నీరు పారుదలలో ఎటువంటి సమస్యలు తలెత్త కుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఇన్‌స్పెక్టర్‌లు, శానిటరీ సెక్రటరీలు, సచివాయల సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

వర్షపు నీరు నిలవకుండా చూడాలి

● రైతులకు సూచించిన ఏవో ప్రేమసాగర్

తెనాలి రూరల్, జూలై 13: వెదపద్ధతిలో విత్తనాలు నాటిన రైతులు పొలాల్లో నీరు నిల్వకుండా తగిన చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి జీ. ప్రేమసాగర్ సూచించారు. తెనాలి మండలంలో శుక్రవారం రాత్రి నుంచి శనివారం వరకు 123.4 మిల్లీ మీటర్ల వర్షం కురిసిందని అన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో వెదపద్ధతి విత్తనాలు పెట్టిన పలు పొలాలను ఏవో ప్రేమసాగర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిపంటలు వెదపద్ధతి ద్వారా మండలంలో 75శాతం విత్తనాలు పెట్టారన్నారు. వారిలో 15 నుండి 20 రోజుల లోపు విత్తనాలు పెట్టిన రైతులు పంటభూముల్లో నీరు నిల్వకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గత రెండు మూడు రోజుల లోపు పెట్టిన రైతులు వారి పంటల్లో వర్షం కారణంగా మొలకలు వచ్చే పరిస్థితి తక్కువగా ఉంటుందన్నారు. ఇటువంటివారు వర్షాలు తగ్గి భూమి తడి ఆరిన తర్వాత తిరిగి వెద పద్ధతి ద్వారా విత్తనాలు పెట్టాల్సి ఉంటుందన్నారు. సమయం తక్కువగా ఉందని భావించిన రైతులు నారుమడులవైపు మొగ్గుచూపాలని సూచించారు.



కుంగిన కల్వర్టు గుర్తించేందుకు కర్ర నాటి ఎర్రగుడ్డ వేసిన స్థానికులు

పాఠశాలల విలీన ప్రక్రియను నిలిపివేయాలి

● ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కే. బసవలింగారావు

తెనాలి రూరల్ / తెనాలి అర్బన్ జూలై 13: విద్యార్థులకు శాపంగా మారిన పాఠశాలల విలీన ప్రక్రియకు సంబంధించిన జీవో 117ను తక్షణమే నిలిపివేయాలని ఏపీటీఎఫ్ జిల్లా కే. బసవలింగారావు అన్నారు. శనివారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌ను యూనియన్ నాయకులతో కలిసి జీవో 117ను రద్దుచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.ఈసందర్భంగా బసవలింగారావు మాట్లాడుతూ.. గత ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతిలో జీవో 117ను తీసుకువచ్చి ప్రాథమిక పాఠశాలలను వీలీనం చేయడంతో గత మూడు సంవత్సరాల్లో దాదాపుగా 10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు స్కూల్స్ బాటపట్టారన్నారు. పాఠశాల విద్యావ్యవస్థను సంక్షోభంలోకి నెట్టిన జీవో 117ను రద్దుచేసి 3,4,5 తరగతుల విలీన ప్రక్రియను ఉపసంహరించుకోనేటట్లు కూటమి ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత జీవో 117ను రద్దుచేసి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తామని చెప్పిన హామీని అమలు చేసే దశగా ముందుకు సాగాలని తెలుగుమీడియంను తిరిగి పునరుద్ధరించాలని కోరారు. మధ్యాహ్నభోజన పథకం ద్వారా విద్యార్థులకు సన్న



మంత్రి మనోహర్‌కు వినతి పత్రం అందిస్తున్న ఏపీటీఎఫ్ నేతలు

బియ్యంతో ఆహారం అందించేలా చూడాలని, తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ స్కూళ్లల్లోని విద్యార్థులకు మాత్రమే అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ మంత్రి నాదెండ్లమనోహర్‌కు వినతి పత్రం అందించినట్లు తెలిపారు. తొలుత పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్లమనోహర్‌ను యూనియన్ నాయకులు, సభ్యులు కలిసి దుశాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఏపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాలీద్, జిల్లా ఉపాధ్యక్షులు పి.జనార్ధన్, పి. లక్ష్మీనారాయణ, లక్ష్మణ్‌కుమార్, మహిళా నాయకురాలు భారతి, జయశ్రీ, రుక్మిణీ, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



మంత్రి అచ్చెన్నాయుడుని సన్మానిస్తున్న కేసన శంకరరావు తదితరులు

మంత్రి అచ్చెన్నాయుడికి బీసీ నేతల సత్కారం

తెనాలి అర్బన్, జూలై 13 : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును బీసీ సంఘాల రాష్ట్ర నాయకులు శనివారం రాజధానిలో కలిసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో సాగుదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పరిష్కరించడటంలో గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని, వాటిని పరిష్కరించేందుకు తగిన కృషి చేయాలని మంత్రి అచ్చెన్నాయుడిని కోరామన్నారు. గత ప్రభుత్వం ఎక్కడా కూడా సాగు నీటి కాల్వలు, డ్రెయిన్ల అభివృద్ధికి ఒక్క రూపాయి కేటాయించలేదన్నారు. రైతులను ఆదుకునేందుకు తగిన ప్రణాళిక లేకపోవడంతో ఆత్మహత్యలు పెరిగాయన్నారు. వ్యవసాయ రంగంపై అనుభవం ఉండటంతో పాటు రైతు కష్టాలు తెలిసిన వ్యక్తి వ్యవసాయ మంత్రి కావడం రైతులు అదృష్టంగా బావిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్, ప్రధాన కార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు, కో-ఆర్డినేటర్ బ్రహ్మానందశర్మ, సోమరాజు, మహేష్, అశోక్ పాల్గొన్నారు.



బీజామృతంతో విత్తన శుద్ధి చేస్తున్నరైతు

ప్రకృతి సేద్యంపై రైతుల దృష్టి

● రసాయనిక అవశేషాలు లేని పసుపు సాగుకి మొగ్గు
● బీజామృతంతో విత్తన శుద్ధి ద్వారా అధిక దిగుబడులు

కొల్లిపర, జూలై 13 : రసాయనిక ఎరువులు లేదా సేంద్రియ ఎరువులు లేదా చివరకు పశువుల ఎరువును గుప్పెడు కూడ వేయకుండా రైతులు వినూత్న పద్ధతి ద్వారా పంటలను సాగు చేసి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. దేశవాళీ ఆవు ద్వారా వచ్చే పేడ, మూత్రం ద్వారా రసాయనిక అవశేషాలు లేని పంటలు పండించటానికి రైతులు మొగ్గు చూపుతున్నారు. డెల్టా ప్రాంతమైన కొల్లిపర మండలంలో పసుపు సాగులో రైతులు నూతన విధానాన్ని అవలంభిస్తున్నారు. వాణిజ్య పంటల్లో గిరాకీ ఉన్న పసుపును అధిక దిగుబడులు సాధించడం కోసం రైతులు రసాయనిక అవశేషాలు లేకుండా సాగు చేయటానికి సిద్ధపడుతున్నారు. కొల్లిపర మండలం తూములూరులో అభ్యుదయ రైతు కొండా కిశోర్‌రెడ్డి 9 సంవత్సరాల నుంచి బీజామృతం ద్వారా పసుపు సాగు చేసి ఎకరానికి 32 క్వింటాళ్లు దిగుబడులు సాధించాడు. దీంతో మండలంలోని రైతులు ఈ విధమైన సాగు పట్ల ఆసక్తిచూపి విత్తన శుద్ధి కోసం బీజామృతాన్ని ఉపయోగిస్తున్నారు. బీజామృతం ద్వారా విత్తనం శుద్ధి చేయడం వలన తెగుళ్లను అరికట్టవచ్చునని, మొలక శాతం బాగా పెరుగుతుందని రైతుల అభిప్రాయంగా ఉంది. బీజామృతం వలన పెట్టుబడులు తగ్గించుకోవచ్చునని, నాణ్యమైన దిగుబడులతో పాటు ఆదాయం కూడ పెరగటానికి అవకాశం ఉందని రైతులు తెలుపుతున్నారు.

బీజామృతం తయారీ ఇలా.. 3 పుట్లు (225కిలోలు) పసుపు విత్తనం శుద్ధికి 10 కిలోల దేశవాళీ ఆవుపేడ, 10లీటర్ల ఆవు మూత్రం, 100గ్రాముల సున్నం, 40లీటర్ల నీళ్ళు అవసరం. వీటన్నింటినీ డ్రమ్ములో కలిపి 12గంటల పాటు నానపెట్టాలి. నానపెట్టిన వాటిని రెండు గంటలకు ఒకసారి కలియ తిప్పాలి. తర్వాత తయారైన బీజామృతాన్ని 2 రోజులలోపు విత్తన శుద్ధి కొరకు ఉపయోగించు కోవచ్చునని, ఈ 3పుట్లు విత్తనాన్ని అర ఎకరం వరకు నాటుకోవచ్చునని రైతు కొండా కిశోర్‌రెడ్డి తెలిపారు.



ఎమ్మెల్యే ధూళిపాళ్ళ, కొలికపూడిలకు స్వాగతం పలుకుతున్న తెలుగు ఫోరం సభ్యులు

సింగపూర్‌లో ఎమ్మెల్యేలకు ఘన స్వాగతం

పొన్నూరుటౌన్, జూలై13 : సింగపూర్ తెలుగు ఫోరం ఆధ్వర్యంలో జరగనున్న టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు నందమూరి తారకరామారావు 101వ జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఎమ్మెల్యేలు ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, జ్యోతిర్మయి దంపతులతో పాటు, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు తెలుగుపూడి ఫోరం సభ్యులు ఘన స్వాగతం పలికారు. సింగపూర్‌లో నివసిస్తున్న తెలుగు వారి కుటుంబాలతో సహా తరలివచ్చి ఎమ్మెల్యేలకు స్వాగతం పలికి వెంట తోడ్కొని వెళ్లారు. సింగపూర్‌లో ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు జరిగాయి.

మొహరం వేడుకలకు

సర్వం సిద్ధం

పొన్నూరుటౌన్, జూలై13 : మొహరం వేడుకలకు పీర్లచావిడి సిద్ధం అవుతుంది. పట్టణంలోని జీబీసీ రోడ్డులో వేంచేసివున్న దాహెర మస్జీద్ సమీపంలోని పీర్ల చావిడిలో శనివారం హజరత్ అలీ పతాకాలను ఆవిష్కరించారు. పీర్లను పతాకాలతో అలంకరించి ప్రత్యేక ప్రార్థనలు చేసారు. గత 7 రోజలుగా పీర్ల చావిడిలో వివిధ రకాల పతాకాలను అలంకరించి ప్రార్ధనలు చేసారు. 9వ రోజు సోమవారం మొహర్రం వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రార్థనలో కమిటి నిర్వాహకులు మొల్లా కరీమ్, హైదర్, గబ్బర్ బాషా, నందాన్ని, నజీర్ తదితరులు పాల్గొన్నారు.